

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి : 7 సంచిక : 294 శనివారం 27- 09 - 2026 ఎడిటర్ : బరిగెల శివ ■ పేజీలు : 8 ■ వెల : 5.00

పబ్లిషర్స్ : తెలంగాణ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ, ఢీల్లీ, కర్ణాటక, బెంగళూర్, తమిళనాడు చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్









- ▶▶ బిజెపి ఏజెంట్‌కు ఉచ్చు బిగిస్తుంది.!
- ▶▶ గజ్జమంటున్న జ్ఞానేశ్ కుమార్
- ▶▶ ఓట్ల రిగ్గింగ్ మాఫియాపై రైడ్స్ జరిగేనా
- ▶▶ ఎన్నికల ఆధారాలన్నీ మాయం.. వాటి సమాచారం శూన్యం.
- ▶▶ సమగ్ర విచారణకు సుప్రీంకోర్టు న్యాయవాదుల డిమాండ్.
- ▶▶ తనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాజ్యాంగ విరుద్ధమైన చట్టాన్ని నిర్మించుకున్నారు.
- ▶▶ జాతీయ ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్ నిన్ను దేవుడు కూడా కాపాడలేడు.
- ▶▶ దేశ ప్రజలకు ద్రోహం చేసిన ఉసురు ఊరికే పోదు.
- ▶▶ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలి.
- ▶▶ అక్టోబర్ 14న దేశం దద్దరిల్లబోతుంది.
- ▶▶ జాతీయ ఎన్నికల కమిషన్ నియమాలకు తూట్లు పొడిచిన జ్ఞానేష్ కుమార్.
- ▶▶ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్నికల కమిషన్ కమిటీలో సభ్యునిగా కచ్చితంగా ఉండాల్సిందే.
- ▶▶ దేశ ప్రజల ఉసురుపోసుకున్నోడు ఎవడు బాగుపడడు.

# దేశంలో ఎన్నికల కమిషనర్ దౌర్జన్యాలు

## ఎస్ఐఆర్ ప్రక్రియ పేరు మీద దేశవ్యాప్తంగా 30 కోట్ల ఓట్లు గల్లంతు.?



డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశంలో కొంత మంది అధికారులు అధికారాల దుర్వినియోగానికి పాల్పడడానికి మాత్రమే జన్మించి ఉంటారనే విధంగా వాళ్ళ అధికార స్వభావం బయటేస్తుందని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. 145 కోట్ల ప్రజల మనోభావాల్ని కాపాడాల్సిన జాతీయ ఎన్నికల కమిషన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దేశంలో జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడడమే కాకుండా ఎన్నికల నియమాలకు విరుద్ధమైన చట్టాలను అధికారికంగా సిద్ధపరచుకొని భారత రాజ్యాంగం కల్పించిన అధికార హోదాలో కూర్చుని రాజ్యాంగానికి విరుద్ధమైన నియమాలను నిర్ణయాలను వ్యక్తిగతంగా అమలుపరిచి జాతీయ ఎన్నికల విధానాలకు తూట్లుపోడువడమే కాకుండా కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్గా పని చేశాడని అందులో భాగంగానే ఈ మధ్యకాలంలో జరిగిన ఎన్నికలలో నామమాత్రంగా కూడా గెలవలేని బిజెపి ఇతర పార్టీల హక్కులపై దాడి చేసి స్ట్రాంగ్ రూములను పగలగొట్టి ఈవీఎం మిషన్లను గల్లంతు చేసి దౌర్జన్యంగా గెలిచిన విధానాలపై అత్యున్నత న్యాయస్థానంలో కేసులు వేయబడగా జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన బండారం బయటపడుతుందేమోనని కేంద్ర ప్రభుత్వానికి కొమ్ముగాసిన విధానం బయటకు పోక్కకుండా అత్యంత రహస్యంగా జాగ్రత్త పడడమే కాకుండా పలు రాష్ట్రాల్లోఎన్నికలలో ఉపయోగించిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను కాల్చి వేయించి స్ట్రాంగ్ రూములలో భద్రపరచబడిన ఈవీఎంలను ధ్వంసం చేయడం వల్ల సుప్రీంకోర్టుకు ఆధారాలు లేకుండా చేయగలిగినానని విర్రవీగుతున్న సమయంలో దేశ యువత జాతీయ ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఎన్నికల పట్ల తీవ్ర అభ్యంతరాలను అనుమానాలను ఆక్రోసాన్ని వెళ్ళగక్కుతూ దేశవ్యాప్తంగా ధర్నాకు పిలుపునివ్వడమే కాకుండా జ్ఞానేష్ కుమార్ జాతీయ ఎన్నికల కమిషన్ కమిషనర్ గా బాధ్యతలు చేపటినప్పటి నుండి ఇప్పటివరకు పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను ఆయా రాష్ట్రాల్లో కొనసాగించిన సర్ ప్రక్రియ విధానాలను వాటి వల్ల తొలగించిన ఓట్లను బిజెపి గెలుపొందిన విధానాలను ఎన్నికల్లో పోలైన ఓట్లను లెక్కించిన ఓట్లను ఈవీఎం మిషన్స్ లలో నమోదు చేయబడిన ఓట్ల ఆధారంగా వివి పేర్ల లెక్కింపులతో సుప్రీంకోర్టు ధర్మాసనంచే సమగ్ర విచారణ చేపట్టి జ్ఞానేష్ కుమార్ ను కఠినంగా శిక్షించాలని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ధర్నాలు రాష్ట్రరోగోలు జరుగుతున్నాయన్నారు.

**అధికార అహం అంతరించిపోవాలి.**

దేశంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని సర్వం దోచుకుంటున్న దగుల్బాజీ నాయకుల పట్ల దేశంలోనీ యువకులైన మేధావులు ఎక్కడికి అక్కడే ధర్నాలు నిర్వహిస్తూ దేశాన్ని కాపాడుకునే ప్రయత్నం ముమ్మరం చేశారని గుర్తు చేశారు. వ్యవస్థలు నాశనమైపోయి పాలకుల దౌర్జన్యాలు పెరిగిపోతున్న సందర్భంలో యువత దేశ రక్షణ కోసం స్పందించిన తీరున భూతో నా భవిష్యత్తు అన్నారు. ముఖ్యంగా ఆయా రాష్ట్రాల్లో కొనసాగించిన సర్ ప్రక్రియ విధానంపై అప్పుడు ఉండబడిన రాష్ట్ర ప్రభుత్వాలతో జాతీయ ఎన్నికల కమిషన్ చేసుకున్న విచారణ ఉడంబడికలో భాగంగా ఎలాంటి ప్రాముఖ్యమైన అంశాలను విచారించాలని అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారో వాటన్నిటిని దేశ ప్రజలకు సుప్రీంకోర్టు న్యాయస్థానానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల విధానాలను పూర్తిగా నాశనం చేసిన జ్ఞానేష్ కుమార్‌ను సుప్రీంకోర్టు కఠినంగా శిక్షించాలని వేడుకుంటున్నామన్నారు. దేశ ప్రజల జీవితాలతో దేశంలోని ఓటర్ల జాబితాలతో చెలగాటలాడిన జాతీయ ఎన్నికల కమిషనర్ను ఏ కోశానా వదిలిపెట్టకూడదన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా అధికార పార్టీ బిజెపి ఓట్ల రిగ్గింకుకు పాల్పడుతున్నట్లు పెద్ద సంఖ్యలో ఆధారాలు బహిర్గతమవుతున్నప్పటికీ ఆయా రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల అక్రమాలపై జాతీయ ఎన్నికల కమిషన్ కనీసం చర్యలు తీసుకోకపోగా అలాంటి వాటిని పెంచి పోషిస్తూ ఉండడం వల్ల దేశంలో ఎన్నికల విధానం పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగిందని గుర్తు చేశారు. ఎన్నికలు జరిగేంతవరకు సీసీటీవీ ఫుటేజ్ నిర్మాణాలు ఎన్నికల నిర్వహణ కార్యక్రమాలు సజావుగా ఉంటుండగా ఎన్నికలు పూర్తవగానే ఉన్నపాటుగా అన్ని సౌకర్యాలు ధ్వంసం అయిపోతున్నాయని అవి భారత రాజ్యాంగ మూలాలను నాశనం చేసే విధంగా ఉన్నాయని గట్టిగా మందలించారు.

**కోట్ల ఓట్లు కొల్లగొట్టారు.**

జాతీయ ఎన్నికల విధానంలో కొత్త భాగం అంటూ సర్ ప్రక్రియ విధానాన్ని ప్రవేశపెట్టి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 30 కోట్ల ఓట్లను తొలగించినట్లు సోషల్ మీడియాలో తీవ్ర ప్రచారం సాగుతున్న నేపథ్యంలో జాతీయ ఎన్నికల విధానంలో భారత రాజ్యాంగం అమలుపరిచిన విధానా లను కొనసాగిస్తే తప్ప భారతదేశానికి రక్షణ లభించదనేది బలంగా విశ్వసిస్తున్నామన్నారు. జాతీయ ఎన్నికల కమిషనర్ ఎంపిక విధానంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కచ్చితంగా ఉండి తీరాలంటూ తక్షణమే సుప్రీం ధర్మాసనం అట్టి చట్టాన్ని సవరిస్తూ త్రిసభ్య కమిటీలో ప్రభుత్వం తరపున ఒక సభ్యుడు ప్రతిపక్షం తరపున మరో సభ్యుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మరో సభ్యునిగా కొనసాగిస్తూ జాతీయ ఎన్నికల కమిషనర్లు ఎన్నుకునే ప్రక్రియ విధానాన్ని తక్షణమే పునఃపరిశీలించి చట్టం రూపంలో అమలుపరిచి దేశానికి రక్షణ కల్పించాలని దేశంలో ఎప్పుడైతే జాతీయ.. మిగతా 2లో..

---

సూరవీడు సర్పంచ్, ఉప సర్పంచ్‌పై

# సస్పెన్షన్ వేటు

**ములుగు జిల్లా/వెంకటాపురం, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

వెంకటాపురం మండలం సూరవీడు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఆరోపణలపై అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. విచారణ లో పంచాయతీ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న జిల్లా అధికారులు సర్పంచ్, ఉప సర్పంచ్‌లపై చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లను ఆరు నెలల పాటు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పంచాయతీ నిధుల వినియోగంలో నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని, నిధుల దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై గ్రామస్థుల్లో చర్చ జరుగుతోంది. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

---

ఆర్యదాన్ ముహమ్మద్-2026 అవార్డు అందుకున్న

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**కేరళ/ నిలంబూర్, సెప్టెంబర్ 25(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్-2026' అవార్డును అందుకున్నారు. కేరళ రాష్ట్రంలోని నిలంబూర్‌లో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా సీఎం అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్యదాన్ ముహమ్మద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం ఎంతో గౌరవంగా భావిసున్నానని తెలిపారు. తనను ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కేరళ వెలుపల నుంచి ఈ అవార్డుకు ఎంపికైన తొలి వ్యక్తిగా నిలవడం మరింత గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కేరళతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేరళకు వచ్చిన ప్రతిసారీ ఎంతో ఆత్మీయ స్వాగతం లభించిందని చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో జరిగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా, అలాగే అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కేరళకు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కేరళ ప్రజలు లౌకికవాదానికి కట్టుబడి ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యదాన్ ముహమ్మద్ గొప్ప రాజకీయ నాయకుడని సీఎం కొనియాడారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించడంతో పాటు, పలువురు ముఖ్యమంత్రుల హయాంలో నాలుగుసార్లు మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. కేరళ రాజకీయాల్లో ఆయన చాణక్యుడిలా వ్యవహరించారని అన్నారు. నిలంబూర్‌తో పాటు కేరళలో కాంగ్రెస్ పార్టీకి ఆర్యదాన్ ముహమ్మద్ ఒక మహావృక్షంలా నిలిచారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన జీవితాంతం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడారని తెలిపారు. ఆర్యదాన్ ముహమ్మద్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ చైర్మన్ ఆర్యదాన్ షౌకత్, కేరళ మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

---



శబరిమల ఆలయంలో

# బంగారు కిరీటం మాయం..

- తనిఖీల్లో వెలుగులోకి..
- స్ట్రాంగ్ రూమ్‌లో 55.72 సవర్ల బంగారు కిరీటానికి బదులుగా 240 గ్రాముల కిరీటం

**శబరిమల, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో భద్రపరిచిన బంగారు కిరీటం మాయమైన ఘటన కలకలం రేపుతోంది. ఆలయ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన 55.72 సవర్ల బంగారు కిరీటం కనిపించకుండా పోయిన విషయం తనిఖీల్లో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. 2012 ఆగస్టులో తమిళనాడుకు చెందిన భక్తులు ఈ బంగారు కిరీటాన్ని అయ్యప్ప స్వామి ఆలయానికి సమర్పించారు. అప్పట్లో ఆలయ రిజిస్టర్‌లో కిరీటం బరువు 445.78 గ్రాములుగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం స్ట్రాంగ్ రూమ్‌లో నిర్వహించిన తనిఖీల్లో అసలు కిరీటానికి బదులుగా కేవలం 240 గ్రాముల బరువున్న మరో కిరీటం ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. దీంతో అసలు బంగారు కిరీటం ఎక్కడికి వెళ్లింది? దాని స్థానంలో తక్కువ బరువున్న కిరీటాన్ని ఎవరు ఉంచారు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ నిబంధనల.. మిగతా 2లో..

## శబరిమల ఆలయంలో

# బంగారు కిరీటం మాయం..

మొదటి పేజీ తరువాయి

ప్రకారం స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచే అధికారం ఒక్క కార్య నిర్వహణ అధికారికి మాత్రమే ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కిరీటం మాయమైన ఘటనపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. కిరీటం ఎప్పుడు మాయమైంది, అసలు కిరీటానికి బదులుగా 240 గ్రాముల కిరీటం ఎలా వచ్చింది, ఈ వ్యవహారంలో ఎవరైనా బాధ్యులున్నారా అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా అధికారులు ఆలయ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన వివరాలు, సంబంధిత సిబ్బంది వ్యవహారాలను పరిశీలించే అవకాశం ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం, బాధ్యులు, అసలు కిరీటం ఆచూకీ తదితర విషయాలు విచారణ పూర్తయిన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## చిన్నారిపై అఘాయిత్యం,

# హత్య కేసులో జీవిత ఖైదు




- సమర్థవంతమైన వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్‌కు డీసీపీ సన్మానం

**పెద్దపల్లి, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి అనంతరం హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడేలా న్యాయస్థానంలో సమర్థవంతమైన వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్‌ను పెద్దపల్లి డీసీపీ బి. రాంరెడ్డి అభినందించారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశం అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్‌ను డీసీపీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. చిన్నారిపై జరిగిన క్రూరమైన నేరానికి సంబంధించి కేసు దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో పకడ్బందీగా ప్రవేశపెట్టి, నిందితుడికి కఠిన శిక్ష పడేలా రవీందర్ అంకితభావంతో పని చేశారని కొనియాడారు. ఇలాంటి తీవ్రమైన నేరాల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడంలో పోలీసులతో పాటు ప్రాసిక్యూషన్ విభాగం కూడా కీలక పాత్ర పోషిస్తుందని డీసీపీ పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ చేసిన సమర్థవంతమైన వాదనలు, కేసులోని సాక్ష్యాధారాలను బలంగా న్యాయస్థానం ముందు ఉంచడం వల్ల నిందితుడికి జీవిత ఖైదు పడిందని తెలిపారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా కృషి చేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ సేవలను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐలు రంజిత్ రావు, కొండపాక ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు చంద్రకుమార్, అశోక్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్‌లో మావోయిస్టు

# లేఖ కలకలం..

**మెదక్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**




మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం ముందు ఎర్రబట్టపై మావోయిస్టు హెచ్చరికలు రాసినా కేసులో తూప్రాన్ మండలానికి చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. గత 16వ తేదీన మేడారం సమ్మక్క- సారక్క దేవాలయంలో రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అక్కడ కూడా మావోయిస్టు హెచ్చరికలతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు.ప్రభుత్వ నుంచి స్పందన రాకపోవడంతో తిరిగి తూప్రాన్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయానికి ఎర్ర ఎర్రబట్టపై హెచ్చరికల కరపత్రాన్ని నిందితులు కట్టారని ఎస్పీ తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా సోషల్ మీడియా, వ్యూస్ కోసం డబ్బు సంపాదనే ధ్యేయంగా మావోయిస్టు పేరును వాడుకోవడానికి తూప్రాన్ మండలం నాగులపల్లికి చెందిన మధు, చింతకింది శ్రీధర్ పథకం వేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి శుక్రవారంకోర్టులో హాజరు పరిచామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేంద్ర గౌడ్, ఎస్సై గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత చాటిన తెలంగాణ..

# ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

- శనివారం ఉదయం 10.30 గంటల్లోపు నిమజ్జన ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 1.24 లక్షల విగ్రహాల నమోదు.. 25 వేల మందికిపైగా పోలీసులతో బందోబస్తు
- ఉత్సవాల్లో 13 మంది మృతి.. 26 మందికి గాయాలు: డీజీపీ సి.వి. ఆనంద్





**హైద్రాబాద్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, ఇప్పటివరకు పూర్తయిన నిమజ్జనాల వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ పోర్టల్‌లో 1.24 లక్షల విగ్రహాలు నమోదయ్యాయని, గతేడాది 1.15 లక్షల విగ్రహాలు నమోదైనట్లు తెలిపారు. ప్రజా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను పోర్టల్‌లో నమోదు చేశామని, అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, వ్యక్తిగత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కలుపుకుంటే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3.5 నుంచి 4 లక్షల వరకు విగ్రహాలు ఉండే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని, మిగిలిన విగ్రహాల నిమజ్జనం శనివారం ఉదయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శుక్రవారం కావడంతో మతపరమైన అంశాలను గౌరవిస్తూ హైదరాబాద్‌లో శోభాయాత్రలు కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయని, దీంతో నిమజ్జనాలు కూడా ఆలస్యంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తుండటంతో కొంత సమయం పడుతోందన్నారు. హైదరాబాద్‌లో గత పది రోజులుగా నిమజ్జనాల కోసం 25 వేల మందికిపైగా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ సీపీ, జీహెచ్ఎంసీ కమిషనర్, కలెక్టర్ తదితరులతో కలిసి ఏరియల్ సర్వే ద్వారా పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల పరిధి విస్తరించడంతో నిమజ్జన విగ్రహాల తరలింపునకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని, ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తూ నిమజ్జన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా టీజీఎస్పీ, ఆర్పీఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఆక్టోపస్ బలగాలను మోహరించినట్లు వెల్లడించారు. డీజీపీ రిజర్వ్ నుంచి ఐదు కంపెనీలను కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో భారీగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ కేంద్రాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్రేన్లు, ఇతర అత్యవసర సేవలను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

గణేష్ ఉత్సవాల సందర్భంగా గత పది రోజుల్లో 13 మంది మృతి చెందడం బాధాకరమని డీజీపీ ఆవేదన వ్యక్తం చేశారు. నిమజ్జన విధుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన కొత్త గూడెం ఎస్సై వెంకన్న మృతి చెందడం విచారకరమన్నారు. సైబరాబాద్ పరిధిలోని పటాన్‌చెరులో ఆరుగురు మృతి చెందడం దురదృష్టకరమని తెలిపారు. ఖైరతాబాద్‌లో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఒకరు మృతి చెందగా, నిర్మల్‌లో గుండెపోటుతో మరొకరు మృతి చెందినట్లు వెల్లడించారు. డీజే శబ్దాల కారణంగా కూడా కొందరు మృతి చెందినట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా జరిగిన వివిధ ప్రమాదాల్లో మొత్తం 26 మంది గాయపడగా, మల్కాజిగిరిలో 17 మంది గాయపడినట్లు చెప్పారు. ప్రజలు శబ్ద కాలుష్యాన్ని తగ్గించి నిబంధనలు పాటించాలని సూచించారు. హైదరాబాద్‌లో మిగిలిన విగ్రహాల నిమజ్జన ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, శనివారం ఉదయం 10.30 గంటల్లోపు నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యేలా లక్ష్యంగా పెట్టుకున్నామని డీజీపీ తెలిపారు. హైదరాబాద్ తోపాటు అన్ని జిల్లాల్లోనూ నిమజ్జనాలు దాదాపు పూర్తయ్యాయని, నల్గొండ, నిర్మల్ తదితర ప్రాంతాల్లో మరికొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణను పోలీసులు ఆరు దశలుగా విభజించుకున్నారని, చివరి దశగా ప్రతి ఒక్కరూ నిమజ్జనం పూర్తి చేసుకుని సురక్షితంగా ఇంటికి చేరేవరకు పోలీసుల విధులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ అంటే అన్ని మతాల ప్రజలు సమైక్యంగా, సోదర భావంతో జీవించే ప్రాంతమని డీజీపీ అన్నారు. గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా సాగడం ప్రజల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. భైంసాలో ముస్లిం సోదరులు 'హిందూ-ముస్లిం భాయ్‌భాయ్' అంటూ గణేష్ ఉత్సవాల్లో పాల్గొనడం తెలంగాణ సమైక్యత, సోదరభావానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను ఆలస్యం చేయకుండా, పోలీసుల సూచనలకు అనుగుణంగా త్వరగా తరలించాలని డీజీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతోపాటు ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరేలా పోలీసులకు సహకరించాలని కోరారు.

# దేశంలో ఎన్నికల కమిషనర్ దౌర్జన్యాలు

మొదటి పేజీ తరువాయి






ఎన్నికల కమిషనర్ ఏకపక్షంగా ఎన్నుకోవడం జరిగిందో అప్పటి నుండే దేశంలో ఇలాంటి అడ్డగోలు విధ్వంశాలు జరుగుతున్నాయని జాతీయ ఎన్నికల కమిషనర్ బిజెపి ఏజెంట్గా పని చేస్తున్నాడంటూ విపక్షాలతో పాటు దేశ ప్రజలు యువత పెద్ద ఎత్తున విమర్శలు చేస్తూ ఆందోళనలు చేపడుతున్నారని గట్టిగా మందలించారు.తొలగించిన ఓట్లను తక్షణమే చేర్చి జాతీయ ఎన్నికల కమిషన్కు బుద్ధి చెప్పాలని కోరారు.ప్రస్తుతం దేశంలో పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్న సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి అన్ని రాష్ట్రాల్లో ఉండబడిన ఓట్ల ప్రక్రియను కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఏ రాష్ట్రంలో చూసిన అప్రజాస్వామికమైన విధానాలను కొనసాగిస్తూ రాజ్యాంగ విధానాలకు అనుకూలంగా జరగాల్సిన ఎన్నికల విధానాలను పూర్తిగా మార్చేసుకొని బిజెపి పార్టీకి అనుకూలంగాను ఏజెంట్ గాను నిర్వహించడం కోసం జాతీయ ఎన్నికల విధానం పనిచేస్తుందని దానికి పూర్తి బాధ్యతగా జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ను బాధ్యునిగా చేస్తూ తక్షణమే తొలగించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.జ్ఞానేష్ కుమార్ జాతీయ ఎన్నికల కమిషన్ పేరు మీద నిధుల దుర్వినియోగమే కాకుండా విధుల దుర్వినియోగానికి పాల్పడి, అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రజాస్వామ్య విలువల దుర్వినియోగానికి పాల్పడి రాజ్యాంగ విలువల దుర్వినియోగానికి పాల్పడి దేశద్రోహంతో కూడిన తప్పును చేశాడని దేశ ప్రజలు బలంగా ఎత్తిచూపుతుండగా ఇప్పటికే కాక్రోచ్ జనతా పార్టీ జాతీయ ఎన్నికల కమిషన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు 48 గంటల సమయాన్ని ఇస్తూ డిమాండ్ చేస్తున్నారని లేదంటే దేశవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామంటూ హెచ్చరించడంలో రాజ్యాంగ రక్షణ దేశ ప్రజల రక్షణ జాతీయ ఎన్నికల విధానం రక్షణ ప్రధాన అంశాలుగా దాగి ఉన్నట్లు దేశ ప్రజలు విశ్వసిస్తున్నారు అన్నారు.అధికార దుర్వినియోగానికి పాల్పడడమే కాకుండా కోట్ల కోట్లను తొలగించి వాటిని కొల్లగొట్టి ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో రిగ్గింగ్ కు పాల్పడుతూ అధికార పార్టీకి సహకరించిన విధానాలపై ఎన్నికలు పూర్తయ్యాక వాటి ఆధారాలను నామరూపం లేకుండా మాయం చేసిన విధానాలపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దేశ ప్రజలు ప్రపంచ ప్రజలు చూసే విధంగా విచారణను లైవ్ టెలికాస్ట్ ద్వారా చూపిస్తూ ఆధారాలను బహిర్గతం చేసి జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను కఠినంగా శిక్షించడం ద్వారా దేశంలో మరి ఏ ఎన్నికల కమిషనర్ తప్పులకు పాల్పడకుండా జాతీయ ఎన్నికల కమిషన్ విధానాన్ని సరిదిద్దాలని చక్క పెట్టాలని సవరించాలని తక్షణమే చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు.దేశ ప్రజల హక్కులన్నీ కూల్చివేస్తూ అణిచివేసిన జాతీయ ఎన్నికల కమిషన్ పై సుప్రీంకోర్టు సుమోటో కేసు స్వీకరించాలని అక్టోబర్ 14న సుప్రీం కోర్టు న్యాయవాదులు చేయబోయే ధర్నా దానినే బలపరుస్తుందని మరొకసారి గుర్తు చేశారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా
శనివారం 26- 09- 2026
www.jaibheemtv.com


### ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంతంగా


# సాగిన కుప్లా ఎన్నికలు

**- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ కె. రాజేందర్, డాక్టర్ కొత్తపల్లి నాగేశ్వరరావు**

**వరంగల్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ (కుప్లా) ఎన్నికలు శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. అధ్యక్ష పదవికి డాక్టర్ కె. రాజేందర్, డాక్టర్ కె. సుబాష్ పోటీ చేయగా, మొత్తం 145 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 84 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫలితాల్లో డాక్టర్ కె. రాజేందర్ 64 ఓట్లు సాధించి విజయం సాధించగా, డాక్టర్ కె. సుబాష్ 20 ఓట్లు పొందారు. దీంతో డాక్టర్ కె. రాజేందర్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రెసైడింగ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి అధికారికంగా ప్రకటించారు. అదేవిధంగా డాక్టర్ కొత్తపల్లి నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డాక్టర్ దండబోయిన శ్రీకాంత్ యాదవ్ ప్రకటించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా డాక్టర్ కె. రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కొత్తపల్లి నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వాణీదేవి, ట్రెజరర్‌గా డాక్టర్ టి. మౌనిక, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ పి. మహేందర్, ఉమెన్ కన్వీనర్‌గా డాక్టర్ భాగ్యమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణలో ప్రెసైడింగ్, రిటర్నింగ్ అధికారులుగా డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ ఫిరోజ్ పాషా షేక్, డాక్టర్ చంద్రశేఖర్, బి. రాజు నాయక్ వ్యవహరించారు. ఎన్నికల సహాయ నిర్వహణ కమిటీ సభ్యులుగా డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఓ. మోహన్, డాక్టర్ బి. సుధీర్ సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. పార్ట్‌టైమ్ అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొని ఎన్నికలను విజయవంతం చేయడం పట్ల రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, ప్రెసైడింగ్ అధికారులు, రిటర్నింగ్





అధికారులను అభినందించారు. పార్ట్‌టైమ్ అధ్యాపకులు ఐక్యమత్యంతో ఎన్నికలను నిర్వహించుకోవడం అభినందనీయమని, పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి యూనివర్సిటీ కూడా అవసరమైన సహకారం అందించాలని రిజిస్ట్రార్ పిలుపునిచ్చారు.

# ప్రమాదం చెప్పి రాదు..ప్రజలకు వినడం లేదు!

- మైనర్ల వాహనాల డ్రైవింగ్‌తో పెరుగుతున్న ప్రమాదాలు.. అతివేగం, నిర్లక్ష్యమే ప్రధాన కారణాలు
- బంగారు భవిష్యత్తును క్షణిక వేగానికి బలిచేయొద్దు
- అన్నిటికంటే గొప్ప సంపద మనిషి ప్రాణమే: డా. మేడపాటి ఇమ్మానుయేల్










సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత, డా. మేడపాటి ఇమ్మానుయేల్

**అమరావతి, సెప్టెంబర్ 25(జై భీమ్ న్యూస్)**

ప్రమాదం చెప్పి రాదని, రోడ్డు ప్రమాదాలపై ఎంత అవగాహన కల్పించినా కొందరు ప్రజలు వాటిని పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు. ముఖ్యంగా మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేక పోవడం, ఒకే వాహనంపై ముగ్గురు, నలుగురు ప్రయాణించడం, బైక్‌లపై విన్యాసాలు చేయడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. లేత వయసులోనే భారీ ద్విచక్ర వాహనాలు చేతికి రావడం, వేగంగా నడపడం, స్నేహితులతో పోటీ పడటం వంటి చర్యలు ఎంతోమంది యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధ మైనప్పటికీ కొందరు తల్లి దండ్రులు పిల్లలకు వాహనాలు ఇచ్చి పంపడం, వారు ఎలా నడుపుతున్నారనే విషయాన్ని పట్టించుకోకపోవడం ఆందోళనకరమన్నారు. మైనర్ వయస్సులో వాహనం నడపడం మొదటి తప్పిదమైతే, వయస్సు వచ్చిన తర్వాత కూడా వేగాన్ని నియంత్రించకుండా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం మరో తీవ్రమైన తప్పిదమని డా. ఇమ్మానుయేల్ అన్నారు. బైక్‌పై ముగ్గురు, నలుగురు ప్రయాణించడం, హెల్మెట్ లేకుండా వెళ్లడం, మొబైల్ ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేయడం, రోడ్డుపై విన్యాసాలు చేయడం, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడం వంటి చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, ఫొటోల కోసం ప్రమాదకరమైన విన్యాసాలు చేయడం, వేగంగా వాహనం నడపడం ఫ్యాషన్‌గా భావించకూడదని, క్షణికమైన ఆనందం కోసం జీవితాంతం బాధపడే పరిస్థితిని తెచ్చుకోవద్దని సూచించారు. ప్రమాదాల గురించి పత్రికల్లో చదువుతున్నా, టీవీల్లో చూస్తున్నా, సామాజిక మాధ్యమాల్లో వీడియోలు చూస్తున్నా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని జాగ్రత్త పడాల్సిన యువతలో కొందరు నిబంధనలు పాటించడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే తమకు విలువ తగ్గుతుందని భావించడం సరికాదని, నిబంధనలు పాటించేవారే నిజమైన బాధ్యత కలిగిన పౌరులని పేర్కొన్నారు. వేగంగా వాహనం నడిపి ప్రమాదానికి గురై కుటుంబాన్ని శోకసంద్రంలోకి నెట్టడం కంటే, నిదానంగా, అప్రమత్తంగా ప్రయాణించి సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే ముఖ్యమన్నారు. వాహనాలను అతివేగంగా నడపడం కేవలం మైనర్లు, యువతకే పరిమితం కాదని, పెద్దవయస్కులు కూడా చాలా సార్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డా. ఇమ్మానుయేల్ తెలిపారు. రోడ్డుపై ఎంత జాగ్రత్తగా వాహనం నడిపినా, ఎదురుగా లేదా వెనుక నుంచి వచ్చే వాహనం నిర్లక్ష్యంగా నడిపితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఓవర్‌టేకింగ్ సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై అకస్మాత్తుగా కుక్కలు, పందులు, గాడిదలు, ఆవులు, గేదెలు వంటి జంతువులు అడ్డంగా రావడం, రోడ్డు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, గుంతలు ఉండటం వంటి కారణాలు కూడా ప్రమాదాలకు దారితీయవచ్చని తెలిపారు.

ఒకప్పుడు మనుషులు ఎక్కువగా కాలినడకన ప్రయాణించేవారని, తరువాత ఎద్దు బండ్లు, గుర్రపు బండ్లు, సైకిళ్లు, మోపెడ్లు, బైకులు, కార్లు వంటి రవాణా సాధనాలు అందుబాటులోకి వచ్చాయని ఆయన వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ప్రయాణం వేగవంతమైనప్పటికీ, అదే వేగం మనిషి ప్రాణాలకు ముప్పుగా మారకూడదన్నారు. “నిదానమే ప్రధానము” అనే మాటను ప్రతి వాహనదారుడు గుర్తుంచుకోవాలని, రోడ్డుపై వేగం కంటే భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అత్యవసర అవసరాలకు ద్విచక్ర వాహనాలను ఉపయోగించవచ్చని, కుటుంబ సభ్యులు నలుగురు, ఐదుగురు కలిసి ప్రయాణించాల్సిన సందర్భాల్లో కారును ఉపయోగించడం సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అయితే అవసరం లేకపోయినా ప్రతి చిన్న పనికి వాహనాలను ఉపయోగించడం వల్ల పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు వృథా కావడంతో పాటు పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని అన్నారు. వాహనాల అధిక వినియోగం వల్ల శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం పెరుగుతున్నాయని, ఇవి సమాజ ఆరోగ్యం, ప్రశాంతతపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

నేటి పరిస్థితుల్లో బైక్‌పై లేదా కారులో బయటకు వెళ్లడం అంటే కేవలం ప్రయాణం చేయడం మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతకు సంబంధించిన బాధ్యతతో కూడుకున్న విషయమని ఆయన అన్నారు. మనం జాగ్రత్తగా వాహనం నడిపినా ఇతరుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, అందువల్ల మన భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందో చెప్పలేమని, అందుకే ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రమాదంలో వాహనం, ఆస్తి నష్టపోతే ఇన్సూరెన్స్ ద్వారా పరిహారం పొందే అవకాశం ఉన్నప్పటికీ, ఒకసారి కోల్పోయిన మనిషి ప్రాణాన్ని ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసినా తిరిగి తీసుకురాలేమని డా. ఇమ్మానుయేల్ అన్నారు. కుటుంబంలో ఒక వ్యక్తి ప్రాణం కోల్పోతే ఆ కుటుంబం జీవితాంతం ఆ లోటును అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. అందుకే ప్రమాదం జరిగిన తర్వాత విచారించడం కంటే ప్రమాదం జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా, వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. యువత ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలని,

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సీటుబెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, ఓవర్‌టేకింగ్ సమయంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. పెద్దలు కూడా తమ ప్రవర్తన ద్వారా పిల్లలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. “అన్నిటికంటే గొప్ప సంపద మనిషి ప్రాణం. మనం, మన కుటుంబాలు, మనుషులే అసలైన సంపద. వాహనం మన ప్రయాణాన్ని సులభతరం చేయడానికి ఉండాలి కానీ మన ప్రాణాల కంటే వాహనం, వేగం, ఫ్యాషన్ ఏదీ గొప్పది కాదు. ప్రమాదం చెప్పి రాదు. ప్రమాదాల గురించి ఎంత చెప్పినా, ప్రజలు వాటిని గుర్తించి ఆచరించినప్పుడే ప్రమాదాలను తగ్గించగలం. వేగం కంటే ప్రాణానికి విలువ ఇవ్వాలి. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం ప్రతి ఒక్కరి కర్తవ్యం” అని సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ తెలిపారు.

### గణేష్ నిమజ్జనం బందోబస్తులో

# ఎస్ఐ వెంకన్న మృతి

**- కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది : సీఎం రేవంత్‌రెడ్డి**

**హైద్రాబాద్, సెప్టెంబర్ 25 ( జై భీమ్ న్యూస్)**



గణేష్ నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం టూ టౌన్ ఎస్ఐ కె. వెంకన్న గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎస్ఐ వెంకన్న మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ వెంకన్న ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని సీఎం పేర్కొన్నారు. వెంకన్న మృతి ఆయన కుటుంబానికే కాకుండా మొత్తం పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. వెంకన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని గుర్తించి, అతనిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి



**- దళితులకు భూమి పంపిణీ నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు**

**హన్మకొండ, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం, అర్హులైన దళితులకు భూమి పంపిణీ చేయాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తూ మాదిగ హక్కుల దండోరా, దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ అంబేద్కర్ సర్కిల్‌లో కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాదిగ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం దళిత కుటుంబాల భూ హక్కులు, ఆత్మగౌరవం, ఆర్థిక భద్రతకు ఎంతో కీలకమని అన్నారు. గత ప్రభుత్వాల కాలంలో వివిధ కారణాలతో దళిత కుటుంబాలకు సంబంధించిన భూముల్లో ఏర్పడిన సమస్యలను సమగ్రంగా సమీక్షించి, అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. దళితుల భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, అన్యాయంగా ఇతరుల పేర్లకు మారినట్లు తేలిన భూములను అర్హులైన అసలు హక్కుదారులకు తిరిగి అందించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. అలాగే అసైన్‌మెంట్ యాక్ట్--1977 ప్రకారం మోర్టేజ్ లోన్సను పునరుద్ధరించాలని కోరారు. భూ సమస్యల పరిష్కారానికి గతంలో చేపట్టిన చర్యలను గుర్తుచేసుకుంటూ, భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. రాజేందర్ సురేష్ బాబూరావు మాట్లాడుతూ దళితుల భూ హక్కులు, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచు రాజేందర్, మాదాసు సురేష్, మన్నే బాబురావు, రామచందర్, కేడేల ప్రసాద్, స్వామి, మందవీరస్వామి, రవీందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
శనివారం 26- 09- 2026
www.jaibheemtv.com







## ప్రజా సమస్యల పరిష్కారానికి
# ప్రజాదర్బార్ చక్కని వేదిక

**- ప్రజల అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషి:ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**

**కాకినాడ, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**
ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా శుక్రవారం జగన్నాథపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను నేరుగా కలుసుకున్న ఎమ్మెల్యే కొండబాబు వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావడానికి ఇది చక్కని వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిర్ణీత గడువులోగా సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కొండబాబు పేర్కొన్నారు. ప్రజల అవసరాలు, సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాదర్బార్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## నూతన పీఏసీఎస్ చైర్మన్లకు
# ఘన సన్మానం



**- రైతుల సంక్షేమానికి పీఏసీఎస్‌లు కీలకం : ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్**

**పర్వతగిరి, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**
పర్వతగిరి మండలంలో ఇటీవల నూతనంగా నియమితులైన పీఏసీఎస్ చైర్మన్లను మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) మాలోత్ శంకర్ నాయక్, సూపరింటెండెంట్ విష్ణుమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్‌గా పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా అత్తి కుమారస్వామి నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. సహకార సంఘాలు రైతుల సంక్షేమంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు రుణ సదుపాయాలు, వ్యవసాయానికి అవసరమైన సేవలు, ఇతర సహకారం మరింత సమర్థవంతంగా అందేలా నూతన చైర్మన్లు కృషి చేయాలని ఆకాంక్షించారు. వారి నాయకత్వంలో సహకార సంఘాలు మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. నూతన చైర్మన్లు పిన్నింటి అనిల్‌రావు, అత్తి కుమారస్వామి మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం, పీఏసీఎస్‌ల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సహకార రంగానికి చెందిన పలువురు పాల్గొని నూతన చైర్మన్లకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించిన
# వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ

**- యాంటీబయోటిక్స్‌ను బాధ్యతాయుతంగా వినియోగించాలి : ప్రొఫెసర్ జి. సమ్మయ్య**

**హన్మకొండ, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**
వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌కు చెందిన వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ జి. సమ్మయ్య ముఖ్యఅతిథిగా, ముఖ్యోపన్యాసకుడిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది "స్వస్థ భారత్ -- యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై అవగాహన" అనే అంశంతో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించడం ఎంతో సముచితమన్నారు. యాంటీబయోటిక్ రెసిస్టెన్స్ ప్రపంచ ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని, ఒకప్పుడు సమర్థవంతంగా పనిచేసిన యాంటీబయోటిక్స్‌కు బ్యాక్టీరియా ప్రతిఘటనను అభివృద్ధి చేసుకోవడం వల్ల అనేక ఇన్‌ఫెక్షన్లు చికిత్సకు లొంగని పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు. యాంటీబయోటిక్స్‌ను విచక్షణారహితంగా వినియోగించడం, వైద్యుల సూచన లేకుండా స్వయంగా మందులు తీసుకోవడం, సూచించిన పూర్తి కోర్సును మధ్యలోనే నిలిపివేయడం, వైరల్ జలుబు, ఫ్లూ వంటి వ్యాధులకు యాంటీబయోటిక్స్ ఉపయోగించడం, పశుసంవర్ధక రంగం, వ్యవసాయంలో అధికంగా యాంటీబయోటిక్స్ వినియోగించడం, పరిశుభ్రత లోపించడం వంటి కారణాలతో యాంటీబయోటిక్ రెసిస్టెన్స్ పెరుగుతోందన్నారు. దీని వల్ల సాధారణ ఇన్‌ఫెక్షన్లను కూడా నయం చేయడం కష్టతరమవుతుందని, ఆసుపత్రుల్లో ఎక్కువ రోజులు చికిత్స పొందాల్సి రావడంతో పాటు వైద్య ఖర్చులు పెరుగుతాయని, తీవ్రమైన సందర్భాల్లో మరణాల ప్రమాదం కూడా అధికమవుతుందని తెలిపారు. శస్త్రచికిత్సలు, క్యాన్సర్ చికిత్సలు, అవయవ మార్పిడి వంటి ప్రాణరక్షక వైద్య సేవల విజయంపై కూడా యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ప్రభావం చూపుతుందని చెప్పారు. యాంటీబయోటిక్ రెసిస్టెన్స్‌ను అరికట్టేందుకు వైద్యుల సూచన మేరకే యాంటీబయోటిక్స్‌ను ఉపయోగించాలని, సూచించిన కోర్సును పూర్తి చేయాలని, మిగిలిపోయిన మందులను లేదా ఇతరుల మందులను వాడకూడదని సూచించారు. చేతుల పరిశుభ్రత, సరైన పారిశుద్ధ్యం, టీకాల ద్వారా ఇన్‌ఫెక్షన్లను నివారించవచ్చని వివరించారు. ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమని ప్రొఫెసర్ జి. సమ్మయ్య పేర్కొన్నారు. సరైన రోగికి, సరైన ఔషధం, సరైన మోతాదు, సరైన సమయం, సరైన మార్గంలో ఔషధాన్ని అందించడం ప్రతి ఫార్మసిస్టు బాధ్యత అని వివరించారు. ఫార్మసిస్టులు కేవలం మందులు పంపిణీ చేసే వ్యక్తులు మాత్రమే కాదని, రోగులకు మందుల వినియోగం, భద్రత, దుష్ప్రభావాలు తదితర అంశాలపై సరైన అవగాహన కల్పించే ఆరోగ్య నిపుణులని అన్నారు. క్లినికల్ ఫార్మసీ, డ్రగ్ ఇన్ఫర్మేషన్, ఫార్మకోవిజిలెన్స్, రోగి భద్రత, ప్రజారోగ్యం, వ్యాధి నివారణ, ఔషధ భద్రత వంటి అనేక రంగాల్లో ఫార్మసిస్టులు విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు. వైద్యులు, ఫార్మసిస్టులు, ఇతర ఆరోగ్య నిపుణుల సమన్వయంతో మెరుగైన ఆరోగ్య సేవలను అందించవచ్చన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, వ్యక్తిగత వైద్యం, ఫార్మాకోజెనోమిక్స్ వంటి ఆధునిక రంగాల్లో ఫార్మసిస్టులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువ ఫార్మసీ విద్యార్థులు పరిశోధన, ఔషధ తయారీ, నాణ్యత నియంత్రణ, రెగ్యులేటరీ వ్యవహారాలు, క్లినికల్ రీసెర్చ్, హాస్పిటల్ ఫార్మసీ, కమ్యూనిటీ ఫార్మసీ వంటి రంగాల్లో రాణించాలని సూచించారు. కొత్త ఔషధాల ఆవిష్కరణకు యువత ముందుకు రావాలని, క్యాన్సర్, మధుమేహం, అంటువ్యాధులు తదితర తీవ్రమైన వ్యాధులకు కొత్త చికిత్సల అవసరం ఉందన్నారు. పరిశోధనలో శాస్త్రీయ ఆధారాలను సక్రమంగా నమోదు చేసి, ధృవీకరించడంతో పాటు నిజాయితీ, పారదర్శకత, నైతిక విలువలను పాటించాలని సూచించారు. యువ ఫార్మసీ విద్యార్థులు తమ వృత్తిని ప్రేమతో, అంకితభావంతో కొనసాగిస్తూ నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుని సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. "మందులు జీవాలను కాపాడతాయి. వాటిని బాధ్యతాయుతంగా వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు కూడా వాటి ప్రభావాన్ని కాపాడుకుందాం" అని అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాను అరికట్టడంలో ఫార్మసిస్టులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. యువతలో కుతూహలం, స్నేహితుల ఒత్తిడి, అవగాహన లోపం వంటి కారణాలతో మాదకద్రవ్యాల వ్యసనం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఓపియం, మార్ఫిన్, హెరాయిన్, కోడైన్, ఆక్సీకోడోన్, ట్రామడాల్ వంటి నార్కోటిక్ డ్రగ్స్ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. అక్రమ మాదకద్రవ్యాల తయారీ, రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం, చట్ట అమలు సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ లేదా క్లినికల్ ఫార్మసిస్ట్ సలహా లేకుండా మందులు, ముఖ్యంగా యాంటీబయోటిక్స్ తీసుకోకూడదని సూచించారు. ఆరోగ్యకరమైన, సురక్షితమైన, డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. అదేవిధంగా ఫార్మసిస్టులు తమ వృత్తి గౌరవాన్ని కాపాడుకోవాలని, ఫార్మసిస్ట్ సర్టిఫికేట్‌ను అద్దెకు ఇవ్వడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. "మానవ ప్రాణాలతో ఆటలాడవద్దు. నైతికతతో, బాధ్యతతో సమాజానికి సేవ చేద్దాం" అని పిలుపునిచ్చారు. "జ్ఞానంతో ఔషధం -- బాధ్యతతో సేవ -ఆరోగ్యకరమైన సమాజం" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు యాంటీబయోటిక్స్‌ను బాధ్యతాయుతంగా వినియోగించడంతో పాటు యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ డా. దేవేందర్ రెడ్డి, డైరెక్టర్ డా. వాహిని రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సనులత, డాక్టర్ మహేష్, డాక్టర్ కుమార్ స్వామి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ పావని, శృతి, రజిని, శివాని తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## నాలుగేళ్ల బాలిక కిడ్నాప్ కేసులో
# లాలాపేట పోలీసుల విజయం

**- మేనమామ, అతని భార్య అరెస్ట్.. బాలికను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగింత**

**గుంటూరు, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**
నాలుగేళ్ల బాలిక కిడ్నాప్ కేసును లాలాపేట పోలీసులు ఛేదించారు. బాలికను కిడ్నాప్ చేసిన ఆమె వరసకు మేనమామ మనోజ్ కుమార్‌తో పాటు అతనికి సహకరించిన అతని భార్య షేక్ సుమయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. బాలికను సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గుంటూరు ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా కాలనీకి చెందిన బత్తుల కొండమ్మ (65) తన మనుమరాలు సాయి పల్లవి (4)ను కిడ్నాప్ చేశారని ఈ నెల 17న లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో లాలాపేట సీఐ ప్రసాద్ పర్యవేక్షణలో క్రైమ్ పోలీస్ సిబ్బంది శంకర్, కిరణ్‌లతో కలిసి ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ కోసం గుంటూరు బస్‌స్టాండ్, విజయవాడ రైల్వే స్టేషన్‌తో పాటు పలు రద్దీ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఆర్టీజీఎస్ 360 కెమెరాల సాంకేతిక సహాయంతో బాలిక బాపట్లలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాపట్ల రైల్వే స్టేషన్‌లో బాలిక ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే అక్కడి ఆర్‌పీఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతో బాలికను గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. దర్యాప్తులో బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తి ఆమెకు వరసకు మేనమామ అయిన మనోజ్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. కిడ్నాప్‌కు సహకరించిన అతని భార్య షేక్ సుమయ్యను కూడా అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సీతారాం తెలిపారు. పోలీసుల తక్షణ స్పందన, సమన్వయంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా బాలికను త్వరగా సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చగలిగామని పోలీసులు తెలిపారు. బాలిక క్షేమంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



# వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పరిశీలన

**- నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి : ఉన్నతాధికారులు**

**వరంగల్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**
వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్ రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంవో కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కొనసాగుతున్న నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులు, వివిధ విభాగాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులను పరిశీలించి వాటి నాణ్యతను అధికారులు సమీక్షించారు. నిర్మాణంలో మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా, వివిధ శాఖల మధ్య సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ప్రతి దశలోనూ నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉన్నతాధికారులకు పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.







## ప్రజారోగ్య పరిరక్షణలో
# ఫార్మసిస్టుల పాత్ర కీలకం

**- మందుల నిల్వలు, సరఫరా, రోగులకు అవగాహన కల్పించడంలో కీలక సేవలు**
**- డీఎంహెచ్‌వో డాక్టర్ పి. కోమలి**

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**
ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలు అత్యంత కీలకమైనవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. కోమలి అన్నారు. ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫార్మసీ అధికారులు, సిబ్బంది, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ కోమలిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కోమలి మాట్లాడుతూ అత్యవసర ప్రాణరక్షక మందులు, టీకాలను నిర్దేశిత ఉష్ణోగ్రతల్లో భద్రపరచడం, మందుల నిల్వలను నిరంతరం పర్యవేక్షించడం, ఎక్కడా మందుల కొరత ఏర్పడకుండా చూడటంలో ఫార్మసీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అలాగే గడువు తీరిన, నాసిరకం మందులను గుర్తించి నిబంధనల ప్రకారం సురక్షితంగా తొలగించడం ద్వారా రోగుల భద్రతకు భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వైద్యులు సూచించిన మందులను నిర్ణీత సమయానికి, సరైన మోతాదులో వినియోగించేలా రోగులకు అవగాహన కల్పించడం ఫార్మసిస్టుల ముఖ్య బాధ్యతల్లో ఒకటని అన్నారు. వైద్యుల సలహా లేకుండా సొంతంగా మందులు వినియోగించకుండా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా ప్రోత్సహించడంతో పాటు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టడంలో ఫార్మసిస్టులు చేస్తున్న కృషి అభినందనీయమని డాక్టర్ కోమలి అన్నారు. జిల్లా ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అహర్నిశలు సేవలందిస్తున్న ఫార్మసీ అధికారులు, సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ అధికారులు సత్యనారాయణ, రాజేశ్, జైలుద్దీన్, మూర్తి, పాపారాయుడు పాల్గొన్నారు.

# అక్టోబర్ 25 నుంచి హెచ్ఏఎం రోడ్ల పనులు ప్రారంభం

- గ్రామాల అభివృద్ధికి రూ.50 లక్షలు.. పనులను గ్రామ ప్రజలే నిర్ణయించాలి : మంత్రి సీతక్క



**హన్మకొండ, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) రహదారుల పనులను అక్టోబర్ 25 నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా హెచ్ఏఎం రహదారుల పైలాన్‌ను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ రంగంపై దాని ప్రభావం, రైతులకు అవసరమైన ముందస్తు సూచనలు తదితర అంశాలపై చర్చించినట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ కూలీలకు రాంజీ పథకం ద్వారా సుమారు రూ.8 వేల కోట్ల విలువైన పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామీణ పేదరికాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం రూ.67 వేల కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. రాంజీ పథకం ద్వారా ప్రతి గ్రామానికి రూ.50 లక్షలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నది గ్రామ ప్రజలే నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులను చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. సర్పంచ్‌ల ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో తాగునీటికి సరిపడా నీటి లభ్యత ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రైతులు ఏ పంటలు సాగు చేయాలనే అంశంపై ముందుగానే అవగాహన కల్పించినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయంపై రైతులకు అవసరమైన సూచనలు అందిస్తున్నట్లు చెప్పారు. గుత్తికోయ గూడాల్లో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. దానకిశోర్ సూచనల మేరకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని గుత్తికోయ గూడాలకు తాగునీరు అందించే అంశంపై దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గుత్తికోయ గూడాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా సంఘాల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రంలోని 553 మండలాల్లో ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు అందించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీరు, వ్యవసాయం, ఉపాధి, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఆయా జిల్లాల్లో గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. ఇదే తరహాలో రేపు రంగారెడ్డి జిల్లాలో కూడా సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు.





సీఎంఓ ఉన్నతాధికారులకు మొక్క అందించి

## స్వాగతం పలికిన సీపీ ఎన్. శ్వేత

**వరంగల్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించేందుకు వచ్చిన సీఎంఓ కార్యాలయ ఉన్నతాధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్ రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంవో కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఉన్నతాధికారులకు మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో నిర్మాణ పనులను ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ రాజశేఖర్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి

**హసన్‌పర్తి, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ. రాజశేఖర్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఆయనను ఘనంగా సన్మానించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ నూతన హెడ్ కానిస్టేబుల్ ఐ. రాజశేఖర్ భుజాలపై మూడు పట్టీలు తగిలించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు. విధుల్లో నిబద్ధత, బాధ్యతాయుతంగా పనిచేసినందుకు రాజశేఖర్ పదోన్నతి పొందారని ఇన్‌స్పెక్టర్ మహేందర్ అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే సేవాస్ఫూర్తితో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఎస్ఐలు దేవేందర్, శీలం రవి, పొన్నాల గోవర్ధన్‌తో పాటు పోలీస్ సిబ్బంది, తోటి కానిస్టేబుళ్లు పాల్గొని నూతన హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సహకార సంఘం కృషి

- మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం
- రైతుల సమస్యలు, సహకార సంఘం సేవలపై విస్తృత చర్చ
- సమావేశానికి హాజరైన అగ్రికల్చర్ ఏ.డి. ఆది రెడ్డి
- చైర్మన్ బయ్యగోని కుమారస్వామితో పాటుగా పాల్గొన్న 12 మంది పాలకవర్గ సభ్యులు





**హసన్‌పర్తి, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సంఘం చైర్మన్ బయ్యగోని కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి అగ్రికల్చర్ ఏ.డి. ఆది రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు అందుతున్న సేవలు, వ్యవసాయ సమస్యలు, ఎరువులు, విత్తనాల లభ్యత, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సహకార సంఘం ద్వారా రైతులకు అందుతున్న సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు. రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించడంతో పాటు వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించారు. అగ్రికల్చర్ ఏ.డి. ఆది రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలను, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, శాఖ పరిధిలో పరిష్కరించగల అంశాలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సహకార సంఘం చైర్మన్ బయ్యగోని కుమారస్వామి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ సంఘం పనిచేస్తోందని అన్నారు. రైతులకు అవసరమైన సేవలను పారదర్శకంగా, సకాలంలో అందించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. రైతులు తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో చైర్మన్ బయ్యగోని కుమారస్వామితో పాటు పాలకవర్గ సభ్యులు కేతపాక రత్నాకర్, చికట్ల కుమారస్వామి, గాజు ఇలుకమూరు, కోలా సురేష్, తాళ్లపల్లి ఆనందం, బొక్క చేరాలు, గోగుల తిరుపతి రెడ్డి, తాబేటి భారతి, పిట్టల రాజు, అరుకొండ నవీన్, తిక్క శైలజ, నూనవత్ లింగు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పాలకవర్గ సభ్యులు చర్చించారు. రైతులు--సహకార సంఘం-వ్యవసాయ శాఖ మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రైతులు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు మనోధైర్యాన్ని అందిస్తాయి




- డాక్టర్ అనితా రెడ్డి

**వరంగల్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు ఆరోగ్య పరిరక్షణతో పాటు ఎంతో మనోధైర్యాన్ని అందిస్తాయని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. వృద్ధుల వారోత్సవాలను పురస్కరించుకుని స్త్రీ, శిశు సంక్షేమం, వృద్ధులు, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేయూ సమీపంలోని లార్డ్ వృద్ధాశ్రమంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనితా రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులు వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, వృద్ధుల ఆరోగ్యం పట్ల సమాజం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులను పలకరించి, వారి ఆరోగ్యం గురించి ఆరా తీస్తే వారి కళ్లలో ఆనందం, సంతృప్తి కనిపించిందని తెలిపారు. తమ ఆరోగ్యం గురించి పట్టించుకునే వారు ఉన్నారనే భావన వృద్ధులకు ఎంతో మనోధైర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల బాధ్యతతో వ్యవహరించి, వారికి ప్రేమ, గౌరవం అందించాలని ఆమె కోరారు. వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టును సంప్రదించవచ్చని తెలిపారు. వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని, వృద్ధులకు అన్ని విధాలుగా అండగా నిలవడమే నిజమైన వృద్ధుల వారోత్సవాల స్ఫూర్తి అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్ వృద్ధాశ్రమ నిర్వాహకులు నాగరాణి నరేష్, వైద్యులు బానోతు సంతోష్, కంటి వైద్యులు ప్రతాపగిరి ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, సంజీవరావు, సమ్మిరెడ్డి, ఏఎన్ఎం సబితారాణి, సరోజ, ఆశా వర్కర్లు మరియ, మమత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లాస్థాయి జాతీయ సైన్స్ సెమినార్-2026

- ఇంధన భద్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలి



**వరంగల్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)**

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జాతీయ సైన్స్ సెమినార్-2026 శుక్రవారం మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. "ఇండియన్ ఎనర్జీ బాస్కెట్--2047: అవకాశాలు--సవాళ్లు" అనే అంశంపై నిర్వహించిన ఈ సెమినార్‌లో వరంగల్ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వివిధ యాజమాన్యాల 18 పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రజెంటేషన్లు అందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో శిలాజ ఇంధనాలపై అధికంగా ఆధారపడుతున్న నేపథ్యంలో 2047 నాటికి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడంతో పాటు సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మారాల్సిన ఆవశ్యకతను విద్యార్థులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, చార్టుల ద్వారా వివరించారు. జిల్లా సైన్స్ అధికారి సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంధన భద్రత దేశ ఆరోగ్య భద్రతతో సమానమని, చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్ వంటి స్వదేశీ ఇంధన వనరులను ప్రోత్సహించడం అత్యవసరమని అన్నారు. విద్యార్థులు సూచించిన పరిష్కారాలు ఆలోచింపజేసేలా ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి మహేష్ నాయక్ మాట్లాడుతూ 2047 నాటికి విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, భవిష్యత్ అవసరాలను కేవలం బొగ్గు ఆధారిత విద్యుత్‌తో తీర్చడం సాధ్యం కాదన్నారు. కాలుష్యాన్ని తగ్గిస్తూ వాతావరణ మార్పులను ఎదుర్కోవాలంటే ఇంధన పొదుపు, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంధన సామర్థ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని అన్నారు. ఇలాంటి సెమినార్లు విద్యార్థుల్లో ఇంధన సంరక్షణ, శాస్త్రీయ ఆలోచనా విధానంపై అవగాహన పెంచుతాయని తెలిపారు. మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి వేదికలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు దోహదపడతాయని అన్నారు. సెమినార్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మామునూరు క్యాంప్‌కు చెందిన సహస్ర ప్రథమ బహుమతి సాధించగా, ఆమెకు గైడ్ టీచర్‌గా అనితా లత వ్యవహరించారు. తెలంగాణ మోడల్ పాఠశాల, వంచనగిరికి చెందిన హుమెరా ఫిర్దౌస్ ద్వితీయ బహుమతి పొందగా, గైడ్ టీచర్‌గా డా. సీ.హెచ్. రవి ఉన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బల్లికుంటకు చెందిన ఎ. నైషిక తృతీయ బహుమతి సాధించగా, గైడ్ టీచర్‌గా సీ.హెచ్. కృష్ణారెడ్డి వ్యవహరించారు. నర్సంపేటకు చెందిన అక్షర ఉన్నత పాఠశాల విద్యార్థిని హరిప్రియ, మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సిహెచ్ రశ్వితలు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన సహస్ర ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో విజేతలకు లయన్స్ క్లబ్ తరఫున షీల్డ్‌లు, జిల్లా విద్యాశాఖ తరఫున విద్యార్థులు, గైడ్ టీచర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమ నిర్వహణలో సైన్స్ టీం సభ్యులు రాంగోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, వాసుదేవరెడ్డి, శ్రవణ్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## యూపీఐ ఛార్జీల ప్రతిపాదనను

# వెనక్కి తీసుకోవాలి

- ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి
డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి డిమాండ్

వరంగల్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)

యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు విధించవద్దని కోరుతూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో యూపీఐ సేవలు ప్రస్తుతం విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులు, చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు, మహిళలు, మధ్యతరగతి ప్రజలు సహా కోట్లాది మంది రోజువారీ అవసరాలకు వినియోగిస్తున్న ముఖ్యమైన డిజిటల్ చెల్లింపు వ్యవస్థగా మారిందని తెలిపారు. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే ప్రతిపాదన అమల్లోకి వస్తే సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు, చిరు వ్యాపారాలు నిర్వహించే వారు, సాధారణ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా, వేగంగా, అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపు వ్యవస్థగా యూపీఐ కొనసాగాలని, దానిపై ఛార్జీలు విధించే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి డిమాండ్ చేశారు. డిజిటల్ చెల్లింపు సేవలు ప్రజలందరికీ ఉచితంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించవద్దంటూ తమ మద్దతును తెలిపారు. యూపీఐ సేవలను ప్రజలకు భారంగా కాకుండా మరింత సౌకర్యవంతంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సాంబమూర్తి, నాయకులు యాకూబ్, రమేష్, నవీన్‌తో పాటు జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## సమాజంలోని చివరి వ్యక్తి

# అభ్యున్నతే లక్ష్యం

- పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ
ఆశయాలను కొనసాగించాలి
-కేడీసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్

హన్మకొండ, సెప్టెంబర్ 25(జై భీమ్ న్యూస్)

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కాకతీయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కేడీసీ కళాశాలలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ సమగ్ర అభివృద్ధితో పాటు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన ప్రతిపాదించిన 'ఏకాత్మ మానవతావాదం', 'అంత్యోదయ' భావనలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యాన్ని చాటిచెప్పాయని పేర్కొన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మై భారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ రాజేష్ మాట్లాడుతూ ప్రజాసేవ, దేశసేవకు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం ఆదర్శమన్నారు. యువత ఆయన ఆలోచనల నుంచి స్ఫూర్తి పొంది దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. జయంతిని పురస్కరించుకుని కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని అక్షయ, ద్వితీయ బహుమతిని భవిత, తృతీయ బహుమతిని కార్తీక్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్, రజనీలత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ బి. సీతారాం, డాక్టర్ గన్‌సింగ్, డాక్టర్ మాలతి, అధ్యాపకులు డాక్టర్ వీరన్న, డాక్టర్ రమేష్, డాక్టర్ జీకే కుమార్, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## మందుల తయారీ నుంచి ప్రజలకు

# చేరే వరకు ఫార్మసిస్టులదే కీలక పాత్ర



- వైద్య రంగంలో ఫార్మసిస్టుల సేవలు మరువలేనివి :
డా. మెరుగు రాధాకృష్ణ గౌడ్

హన్మకొండ, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)

మందుల తయారీ నుంచి అవి ప్రజలకు సురక్షితంగా చేరే వరకు ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ అబ్జర్వర్ డా. మెరుగు రాధాకృష్ణ గౌడ్ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా ఆయన ఫార్మసిస్టుల సేవలను కొనియాడారు. వైద్య రంగంలో వైద్యులు, ఫార్మసిస్టులు పరస్పర సమన్వయంతో పనిచేసే ఆరోగ్య సేవా వ్యవస్థలో కీలక భాగస్వాములని తెలిపారు. రోగ నిర్ధారణ, చికిత్సలో వైద్యులు ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తిస్తే.. ఔషధాల తయారీ, నాణ్యత, నిల్వ, పంపిణీతో పాటు వాటి సరైన వినియోగంపై ఫార్మసిస్టులు కీలక బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఫార్మసిస్టులు లేకుండా ఔషధ రంగాన్ని ఊహించలేమని డా. రాధాకృష్ణ గౌడ్ అన్నారు. వైద్యుడు చికిత్సను సూచించినప్పటికీ, ఆ చికిత్సలో ఉపయోగించే ఔషధాల శాస్త్రీయ పరిజ్ఞానం, నాణ్యత, వినియోగ విధానం తదితర అంశాల్లో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో విలువైనదని వివరించారు. ప్రజలకు అందుతున్న ప్రతి ఔషధం వెనుక ఫార్మసీ శాస్త్రవేత్తలు, ఫార్మసిస్టుల పరిశోధన, తయారీ, నాణ్యత నియంత్రణ, ఔషధ భద్రతకు సంబంధించిన కృషి ఉంటుందని తెలిపారు. మందుల తయారీ నుంచి రోగులకు సరైన ఔషధ వినియోగంపై అవగాహన కల్పించే వరకు ఫార్మసిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. 'డాక్టర్' అనే గౌరవప్రదమైన పిలుపు వైద్య వృత్తికి సంబంధించినదైతే, 'ఫార్మసిస్ట్' అనేది ఔషధ శాస్త్రంలో నిపుణుడైన ఆరోగ్య వృత్తి నిపుణుడిని సూచిస్తుందని తెలిపారు. రెండు వృత్తులు వేర్వేరు బాధ్యతలను నిర్వర్తించినప్పటికీ ప్రజారోగ్య పరిరక్షణలో పరస్పరం పూరకంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రజలు వైద్యుల సూచనలు లేకుండా మందులను స్వయంగా వినియోగించకుండా, వైద్యులు మరియు ఫార్మసిస్టుల సలహాలను పాటించాలని డా. రాధాకృష్ణ గౌడ్ సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ఫార్మసిస్టుల సేవలను గుర్తించి గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు.

## గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీకి ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలి

మాజీ చైర్మన్ డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ డిమాండ్

పెద్ద అంబర్‌పేట్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)



గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం పూర్తయి రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ప్రత్యేక అధికారిని (పీఐసీ) నియమించకపోవడం దురదృష్టకరమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో పరిపాలన సజావుగా కొనసాగేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక అధికారిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు, అలాగే మార్కెట్‌కు సంబంధించిన అద్దెలు తదితర చెల్లింపులను సకాలంలో నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణి కారణంగానే మార్కెట్ కమిటీ పరిస్థితి ఇలా తయారైందని రామ్ నరసింహ గౌడ్ విమర్శించారు. మార్కెట్‌లో ప్రతిరోజూ రైతులు, హమాలీలు, వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, హమాలీలకు కావాల్సిన సౌకర్యాలు, వ్యాపారస్తులకు అవసరమైన వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్ కమిటీ పరిపాలనకు ప్రత్యేక అధికారి లేకపోవడంతో పలు అంశాలు పెండింగ్ లో పడే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రభుత్వం ఇక నైనా స్పందించి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమి టీకి వెంటనే ప్రత్యేక అధికారిని నియమించాలని డిమాండ్ చేశా రు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్య క్రమాలు చేపడతామని రామ్ నరసింహ హెచ్చరించారు.

## తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

హన్మకొండ, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)



గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళిక రూపొందించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించిన పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, ఎల్‌నినో సన్నద్ధత, వీబీజీ రాంజీ, హ్యామ్ రోడ్లపై మంత్రి సీతక్క అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల్లో తాగునీరు, సాగునీరు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి వనరులు, బోర్లు, మోటార్లు, రిజర్వాయర్లు, పైపులైన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. మోటార్లు, పైపులైన్లలో సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మించాలని సూచించారు. చెక్‌డ్యామ్‌లు, బోర్ రీచార్జ్ పనులు చేపట్టి భూగర్భ జలాలను పెంచాలని తెలిపారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటి వసతులను కూడా పరిశీలించాలని అన్నారు. హ్యామ్ రోడ్లపై కూడా మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో మూడు విడతల్లో 18,472 కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 7,448 కిలోమీటర్ల రోడ్లను చేపట్టనున్నట్లు చెప్పారు. సుమారు 3,000 గ్రామపంచాయతీల్లో ఈ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కొన్ని హ్యామ్ రోడ్ల పనులను అక్టోబర్ 25 నుంచి, మరికొన్ని నవంబర్ మొదటి వారంలో ప్రారంభించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీకి, గ్రామపంచాయతీ నుంచి మండల కేంద్రానికి రహదారి సదుపాయం కల్పించడమే హ్యామ్ రోడ్ల లక్ష్యమని మంత్రి తెలిపారు. రోడ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంచడం, నీటి సంరక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్లు, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఎన్‌సీ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.






## వృద్ధాశ్రమంలో వైద్య శిబిరాన్ని పర్యవేక్షించిన

# డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

హన్మకొండ, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)

వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వృద్ధాశ్రమాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో భాగంగా పెద్దమ్మగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని స్వయం కృషి మహిళా సొసైటీ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య పర్యవేక్షించారు. సహృదయ వృద్ధాశ్రమంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మదన్ మోహన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్ధులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవలు, అవసరమైన మందుల పంపిణీ తదితర అంశాలను డీఎంహెచ్ఓ పరిశీలించారు. వృద్ధుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన వైద్య సేవలను నిరంతరం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వృద్ధుల్లో సాధారణ అనారోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించాలని డాక్టర్ అప్పయ్య సూచించారు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, డాక్టర్ విజయరెడ్డి, డాక్టర్ సృజన, హెచ్ఈఓలు సాయి, వెంకటేశ్వర్లు, ప్రతాపగిరి ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు హరిప్రసాద్, మధు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ లడ్డూ వేలంలో బాలాపూర్ రికార్డు..

- రూ.39 లక్షలకు దక్కించుకున్న ప్రణీత్ రెడ్డి
- 32 ఏళ్లలో రూ.450 నుంచి రూ.39 లక్షలకు.. ఏటా పెరుగుతున్న డిమాండ్

హైద్రాబాద్, సెప్టెంబర్ 25 (జై భీమ్ న్యూస్)

హైదరాబాద్ నగరంలోని ప్రసిద్ధ బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం మరోసారి రికార్డు సృష్టించింది. 2026లో నిర్వహించిన వేలంలో సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో గత ఏడాది నమోదైన రూ.35 లక్షల రికార్డు బద్దలైంది. 1994లో కేవలం రూ.450తో ప్రారంభమైన బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం 32 ఏళ్లలో రూ.39 లక్షల స్థాయికి చేరడం విశేషంగా నిలిచింది. బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం 1994లో తొలిసారిగా ప్రారంభమైంది. ఆ ఏడాది స్థానిక రైతు కొలను మోహన్‌రెడ్డి రూ.450కు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు, స్థానికులకు పంచడంతో పాటు పొలంలో చల్లిన తర్వాత పంట దిగుబడి పెరిగిందని ఆయన అనుభవాన్ని పంచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో లడ్డూను సొంతం చేసుకుంటే సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలుగుతాయనే నమ్మకం ప్రజల్లో క్రమంగా బలపడింది. ఆ తర్వాత ప్రతి ఏడాది వేలంలో లడ్డూ ధర పెరుగుతూ వచ్చింది. 2002లో తొలిసారిగా రూ.1 లక్ష మార్కును దాటి రూ.1.05 లక్షలు పలికింది. 2007లో రూ.4.15 లక్షలు, 2015లో రూ.10.32 లక్షలు, 2018లో రూ.16.60 లక్షలు, 2019లో రూ.17.60 లక్షలకు చేరింది. 2020లో కరోనా మహమ్మారి కారణంగా వేలం నిర్వహించలేదు. ఆ ఏడాది లడ్డూను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. అనంతరం 2021లో రూ.18.90 లక్షలు, 2022లో రూ.24.60 లక్షలు, 2023లో రూ.27 లక్షలు, 2024లో రూ.30.01 లక్షలు పలికింది. 2025లో కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు లడ్డూను దక్కించుకుని అప్పటి రికార్డును నెలకొల్పారు. తాజాగా 2026 వేలంలో సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు బాలాపూర్ గణేష్ లడ్డూను దక్కించుకోవడంతో ఆ రికార్డు కూడా అధిగమించబడింది. రూ.450తో ప్రారంభమైన ఈ లడ్డూ వేలం మూడు దశాబ్దాలకుపైగా కొనసాగుతూ భక్తుల్లో పెరుగుతున్న ఆదరణతో ఏటా కొత్త రికార్డులు సృష్టిస్తూ రూ.39 లక్షల స్థాయికి చేరింది.

## ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం.. భక్తి వేడుకా?

# రాజకీయ డ్యాన్స్ వేదికా?

**- తొమ్మిది రోజుల భక్తి ఎక్కడ? నిమజ్జనంలో రాజకీయ పాటలు ఎందుకు?**

**(జై భీమ్ ప్రత్యేక కథనం)**



**- డాక్టర్ బరిగెల శివ**

తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని దర్శించుకుని పూజలు చేసిన ప్రజలు.. నిమజ్జన సమయానికి వచ్చేసరికి వాతావరణం రాజకీయ పాటలు, డ్యాన్సులతో మారిపోవడం ఎంత వరకు సమంజసం? ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జన శోభా యాత్రలో రాజకీయ నాయకులకు సంబంధించిన పాటలకు పలువురు డ్యాన్స్ చేసిన దృశ్యాలు చర్చకు దారితీశాయి. పండుగ అంటే భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయం, సంస్కృతి. మరి ఆ పవిత్రమైన కార్యక్రమంలో రాజకీయ ప్రచారాన్ని పోలిన పాటలు, రాజకీయ నాయకుల పేర్లతో నినాదాలు ఎందుకు?వినాయకుడి ముందు భక్తి పాటలు వినిపించాల్సిన చోట రాజకీయ పాటలు వినిపించాలా?ఒక మతపరమైన పండుగను రాజకీయ వేదికగా మార్చడం వల్ల ఇతర భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉంది. రాజకీయ నాయకులకు అభిమానులు ఉండటం సహజం. కానీ దేవుడి నిమజ్జన కార్యక్రమంలో రాజకీయ అభిమాన ప్రదర్శన చేయడం వల్ల పండుగ అసలు ఉద్దేశమే పక్కదారి పట్టే పరిస్థితి ఏర్పడుతుంది.మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. ప్రజలకు క్రమశిక్షణ, నియ మాలు పాటించాలని చెప్పాల్సిన పోలీసులు కూడా ఇటువంటి సందర్భాల్లో రాజకీయ పాటలకు డ్యాన్స్ చేస్తూ కనిపిస్తే, సాధారణ ప్రజలకు ఏ సందేశం వెళ్తుంది?

పోలీసులు రాజకీయాలకు అతీతంగా ఉం డాల్సిన వ్యవస్థ.పండుగలు రాజకీయ ప్రచా రానికి అతీతంగా ఉండాల్సిన వేదికలు.భక్తి పేరుతో ప్రారంభమైన కార్యక్రమం చివరకు రాజకీయ ప్రదర్శనగా మారితే దానికి బా ధ్యత ఎవరిది? నిర్వాహకులదా? రాజకీయ నాయకులదా? లేక అక్కడ విధుల్లో ఉన్న అధికారులదా?సనాతన ధర్మం, సంస్కృతి, సంప్రదాయం గురించి గొప్పగా మాట్లాడే వారు ముందుగా ఆ సంప్రదాయాల గౌర వాన్ని కాపాడాల్సిన అవసరం లేదా? దేవుడి పండుగను రాజకీయ రంగస్థలంగా మా ర్చకండి.భక్తిని రాజకీయ నినాదాలతో కలుషితం చేయకండి.పోలీసు వ్యవస్థను రాజ కీయ వినోదంలో భాగం చేయకండి.రాబోయే రోజుల్లో గణేశ్ ఉత్సవాలు నిజమైన భక్తి, సంస్కృతి, సామాజిక ఐక్యతకు ప్రతీకలుగా ఉండాలంటే.. రాజకీయ పార్టీల ప్రచారానికి, నాయకుల పాటలకు, వ్యక్తిగత అభిమాన ప్రదర్శనలకు దూరంగా ఉంచాల్సిన అవసరం ఉంది.భక్తి ప్రజలను కలపా లి.. రాజకీయ ప్రదర్శన ప్రజలను విడదీయకూడదు.





## సితార బ్యానర్‌లో ధనుష్ కొత్త చిత్రం..

**జై భీమ్ న్యూస్, సినిమా :**

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా సినిమా 'డి-56' (ఙ56) మధురైలో పూజా కార్యక్రమాలతో అధి కారికంగా ప్రారంభమైంది. 'లబ్బర్ పందు' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న యువ దర్శకుడు తమిళరసన్ పచముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో ధనుష్ కెరీర్‌లో మరో వైవిధ్యమైన చిత్రం రాబోతుందని అభిమానులు భావిస్తున్నారు.ఈ చిత్రంలో ధనుష్ సరసన ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, లెజెండరీ కమెడియన్ వడివేలు, టాలెంటెడ్ నటుడు ఎస్.జె. సూర్య మరియు 'ఉరియడి' ఫేమ్ విజయ్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భిన్నమైన తరాల నటుల కలయికతో వస్తున్న ఈ భారీ తారాగణంపై సినిమా ఇండస్ట్రీలో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి యువ సంగీత దర్శకుడు సాయి అభ్యాంకర్ సంగీతం అందిస్తుండటం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఫైమ్ మార్క్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. మధురైలో లాంఛ్ కార్యక్రమం పూర్తి కావడంతో, త్వరలోనే సినిమా షూటింగ్ తో పాటు కథకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి. మరోవైపు ధనుష్ నటించిన 'ఓం' సినిమా నవంబర్‌లో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఒకవైపు రిలీజ్‌కు రెడీ అవుతూనే, మరోవైపు ఇలా కొత్త ప్రాజెక్ట్‌ను కూడా అధికారికంగా ప్రారంభించి ధనుష్ ఫుల్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారు.

## గుండెల్లో ప్రేమను నింపేలా..

**జై భీమ్ న్యూస్, సినిమా :**

బాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ 'లవ్ అండ్ వార్' సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ ఒక్కొక్కటిగా ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా ఆలియా భట్ ఫస్ట్ లుక్‌ను అధికారికంగా విడుదల చేసింది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాను తెరకెక్కి స్తున్నాడు.ఆగ్ భీ, దిల్ కీ జాన్ భీ!(కసిగా మంట పెట్టేలా.. గుండెల్లో ప్రేమను నింపేలా) అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, వికీ కౌశల్ కూడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్టార్ హీరో హీరోయిన్ల కాంబి నేషన్ కావడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక అన్నీ అనుకున్నట్లుగా జరిగితే, ఈ భారీ బడ్జెట్ రొమాంటిక్ డ్రామా సినిమాను 2027 జనవరి 21న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. థియేటర్లలో కలుద్దాం! అంటూ చిత్ర బృందం ఇచ్చిన అప్‌డేట్‌తో అభిమానులు ఫుల్ ఖుషి అవుతున్నారు.

## 'అనుమాన పక్షి' రివ్యూ..

**జై భీమ్ న్యూస్, సినిమా :**

'డిజె టిల్లు' వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు విమల్ కృష్ణ తెరకెక్కించిన తాజా చిత్రం 'అనుమాన పక్షి'. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కథాకథనాలు ఎలా ఉన్నాయో సమీక్షలో చూద్దాం.

**కథేంటంటే:** సన్నీ (రాగ్ మయూర్) 'అనుమాన పక్షి' పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నడుపుతుంటాడు. ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించడం, అందరినీ అనుమానించడం అతని నైజం. ఈ క్రమంలో తన స్నేహితుడు అనంతు డిప్రెషన్‌లో ఉన్నానని, కాశ్మీర్‌లో ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ చేస్తాడు. దాంతో సన్నీ, రమ్య అనే అమ్మాయిని ఇష్టపడే వర్మ (ప్రిన్స్) సహాయంతో కాశ్మీర్ బయలుదేరుతాడు. అక్కడ కన్య (మెరిన్ ఫిలిప్) పరిచయమవ్వడం, అనుకోకుండా వర్మ హత్యకు గురికావడం, రీల్స్ చేయడానికి పిచ్చిగా ప్రయత్నించే పోలీస్ ఆఫీసర్ వాసు (అజయ్) ఎంట్రీ ఇవ్వడం జరుగుతుంది. వీరందరి మధ్య సంబంధం ఏమిటి? ఈ చిక్కుముడిని సన్నీ ఎలా విప్పాడు? అనేదే ఈ చిత్ర అసలు కథ.

**విశ్లేషణ:** దర్శకుడు విమల్ కృష్ణ ఎంచుకున్న పాయింట్ చాలా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే హీరో పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు విభిన్నంగా నవ్విస్తాయి. ప్రథమార్ధంలో హీరో చేసే అల్లరి, సిచ్యుయేషనల్ కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ద్వితీయార్ధంలో అజయ్ పోలీస్ ఆఫీసర్‌గా చేసిన హంగామా, రీల్స్ కాన్సెప్ట్ ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సరదాగా సాగుతాయి. స్క్రీన్‌ప్లేలో సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తాయి.

**నటీనటుల ప్రతిభ:** లీడ్ రోల్ చేసిన రాగ్ మయూర్ తన అనుమానాలతో కూడిన పాత్రలో చాలా సహజంగా నటించాడు. మంచి టైమింగ్‌తో నవ్వులు పూయించాడు. తెలుగు తెరకు పరిచయమైన మెరిన్ ఫిలిప్ తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో మెప్పించింది. ప్రిన్స్, అజయ్ తమ పాత్రల పరిధి మేరకు చక్కటి నటన కనబరిచారు.

## వినాయకుడి పేరుతో కోట్ల ఖర్చు..

## పారిశుద్ధ్య కార్మికుల బతుకులకు మాత్రం నిధులేవీ?

**హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాలపై జై భీమ్ ప్రత్యేక కథనం**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లో వినాయక చవితి సందర్భంగా భారీ సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటు చేయడం, కోట్ల రూపాయలు ఖర్చు చేయడం, లడ్డూ వేలాల్లో లక్షలు.. కొన్ని సందర్భాల్లో కోట్లకు చేరే మొత్తాలు పలకడం ప్రతి ఏడాది చర్చనీయాంశంగా మారుతోంది. ఈ ఏడాది కూడా బాలాపూర్ లడ్డూ రూ.39 లక్షలు పలకగా, మరికొన్ని ప్రాంతాల్లో భారీ మొత్తాలకు లడ్డూ వేలాలు జరిగినట్లు వార్తలు వచ్చాయి.ఇంత భారీగా డబ్బులు ఖర్చు అవుతున్నప్పుడు ఈ డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరి నుంచి వస్తోంది? ఎక్కడ ఖర్చవుతోంది? దానికి పూర్తి లెక్కలు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. లడ్డూ వేలాల్లో వచ్చిన ప్రతి రూపాయినీ నల్లధనంగా పరిగణించడం సరైంది కాదు. అయితే భారీ మొత్తాల లావాదేవీలు జరుగుతున్నప్పుడు ఆర్థిక పారదర్శకత, చట్టపరమైన పన్నుల బాధ్యతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం మాత్రం ఉంది.ఒకవైపు ప్రభుత్వం పుస్తక ప్రదర్శనలు, చిన్న వ్యాపారాలు, షాపుల నుంచి వివిధ రకాల ఫీజులు వసూలు చేస్తోంది. మరోవైపు ప్రజా స్థలాల్లో భారీగా నిర్వహించే మతపరమైన ఉత్సవాల ద్వారా జరిగే ఆర్థిక లావాదేవీల విషయంలో కూడా పారదర్శకమైన లెక్కలు, చట్టపరమైన నిబంధనలు ఒకే విధంగా ఉండాలనే డిమాండ్ వినిపిస్తోంది.అందుకే ప్రతి వినాయక విగ్రహం ఏర్పాటు చేసుకునే నిర్వాహకుల నుంచి రూ.10,000 చొప్పున ప్రత్యేక సంక్షేమ రుసుము వసూలు చేసి, ఆ మొత్తాన్ని ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమ నిధికి మళ్లించాలనే ప్రతిపాదన ముందుకు రావాలి. అలాగే లడ్డూ వేలాల్లో భారీ మొత్తాలు వచ్చిన సందర్భాల్లో చట్టపరంగా వర్తించే పన్నులు, ఆదాయ లెక్కలు, లావాదేవీల పారదర్శకతను ప్రభుత్వం పరిశీలించాలి. పన్ను విధానం విషయంలో చట్టం ఏది అనుమ



తిస్తుందో దాని ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఎందుకంటే వినాయక నిమజ్జనం సమయంలో రోడ్లను శుభ్రం చేసేది ఎవరు? చెత్తను తొలగించేది ఎవరు? రాత్రింబవళ్లు ప్రజల కోసం పనిచేసేది ఎవరు? అదే పారిశుద్ధ్య కార్మికులు.వినాయకుడి లడ్డూకు లక్షలు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్న సమాజం, ఆ ఉత్సవాల తర్వాత చెత్తను తొలగించే కార్మికుల సంక్షేమానికి కూడా అదే స్థాయిలో బాధ్యత తీసుకోవాలి.భక్తి వ్యక్తిగత విశ్వాసం... కానీ ప్రజా వనరులు ఉపయోగించినప్పుడు ప్రజా బాధ్యత తప్పని సరి.వినాయకుడి పేరుతో కోట్ల రూపాయల ఖర్చు జరుగుతుంటే...

**ఆ డబ్బుకు లెక్కలు ఎందుకు ఉండకూడదు?**

లడ్డూ వేలంలో లక్షలు పలుకుతుంటే... పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఎందుకు ఉండకూడదు? ఉత్సవాలు ప్రజల కోసం అయితే...ఆ ఉత్సవాల భారాన్ని మోసే కార్మికులకు కూడా న్యాయం జరగాలి.భక్తి పేరుతో ఖర్చు చేసే ప్రతి రూపాయికి పారదర్శకత ఉండాలి... ఉత్సవాల తర్వాత ప్రజల కోసం పనిచేసే కార్మికుడి జీవితంలో కూడా వెలుగు ఉండాలి.

## ఓయో రూమ్స్... డిగ్రీ పూర్తి చేయని యువకుడి ఆలోచన నుంచి ప్రపంచవ్యాప్త వ్యాపార సామ్రాజ్యం

**- పందొమ్మిదేళ్ల వయసులో మొదలైన ప్రయాణం.. వేల కోట్ల వ్యాపారంగా ఎదిగిన రితేష్ అగర్వాల్ కథ**

**(జై భీమ్ ప్రత్యేక కథనం)**

హోటల్ గది కావాలంటే ఇప్పుడు చాలామంది ముందుగా గుర్తు చేసుకునే పేర్లలో ఓయో ఒకటి. ఒకప్పుడు తక్కువ ధరలో గదులు దొరకడం, పరిశుభ్రత, సౌకర్యాలు, ముందస్తు బుకింగ్ వంటి సమస్యలను పరిష్కరించాలనే ఆలోచనతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు భారతదేశాన్ని దాటి అనేక దేశాలకు విస్తరించింది. ఈ సంస్థ వెనుక ఉన్న వ్యక్తి ఒడిశాకు చెందిన యువ పారిశ్రామికవేత్త రితేష్ అగర్వాల్. చిన్న వయసులోనే వ్యాపారంపై ఆసక్తి పెంచుకున్న రితేష్ అగర్వాల్ తొలుత తక్కువ ధరలో అందుబాటులో ఉండే వసతి సదుపాయాలను ఒకే వేదికపై అందించాలనే ఆలో చనతో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణిస్తున్న సమయంలో తక్కువ ధర హోటళ్లలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన గమనించారు. గదుల పరిశుభ్రత, సేవల నాణ్యత, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, గది ముందస్తు బుకింగ్ వంటి అంశాల్లో అనేక లోపాలు ఉన్నాయని గుర్తించారు.హోటళ్లను కేవలం ఒక జాబితాగా చూపించడం కాకుండా వాటి సేవలను మెరుగుపరచి, ఒక నిర్దిష్ట ప్రమాణంతో వినియోగదారులకు అందించాలనే ఆలోచనతో ఆయన ముందుకు సాగారు. తొలుత ప్రారంభించిన ఓరావెల్ స్టేస్ అనే సంస్థ తర్వాత ఓయోగా రూపుదిద్దుకుంది. 2013లో ఓయో ప్రయాణం కొత్త దశలోకి వెళ్లింది.ప్రారంభ దశలోనే రితేష్ అగర్వాల్‌కు యువ పారిశ్రామికవేత్తలకు అందించే థీల్ ఫెలోషిప్ లభించింది. దాని ద్వారా లభించిన ఒక లక్ష అమెరికా డాలర్ల నిధులను తన వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి వినియోగించారు. అనంతరం పెట్టుబడులు పెరగడంతో సంస్థ విస్తరణ వేగం పుంజుకుంది.ఓయో భాగస్వామ్య హోటళ్లలో అవసరమైన మార్పులు చేయడం, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, గదులను సులభంగా ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించడం, హోటల్ యజమానులకు మరిన్ని బుకింగ్‌లు తీసుకురావడం వంటి అంశాలపై దృష్టి పెట్టింది. దీంతో హోటల్ యజమానులకు వ్యాపారం పెరగగా, వినియోగదారులకు ఒకే వేదికపై అనేక వసతి ఎంపికలు అందుబాటులోకి వచ్చాయి.2015లో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడితో ఓయో విస్తరణ మరింత వేగం పుంజుకుంది. భారతదేశంలోని ప్రధాన నగరాల నుంచి ఇతర దేశాల మార్కెట్లకు సంస్థ అడుగులు వేసింది. కాలక్ర మంలో కేవలం తక్కువ ధర హోటళ్లకే పరిమితం కాకుండా కుటుంబాల వసతి, పర్యాటక వసతి, సెలవుల గృహాలు, వ్యాపార ప్రయాణికుల వసతి వంటి అనేక రంగాల్లోకి విస్తరించింది.అయితే ఓయో ప్రయాణంలో సవాళ్లు కూడా ఎదురయ్యాయి. కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలు నిలిచిపోవడంతో హోటల్ రంగం తీవ్రంగా దెబ్బతింది. ఓయో కూడా ఆ ప్రభావానికి గురైంది. బుకిం గ్‌లు తగ్గిపోవడంతో సంస్థ తన వ్యాపార విధానాలను మార్చు కోవాల్సి వచ్చింది. లాభాలు తీసుకురాని కార్యకలాపాలను తగ్గించడం, ఖర్చులను నియంత్రించడం, హోటల్ భాగస్వామ్య విధానాలను మార్చడం, లాభదాయకతపై దృష్టి పెట్టడం వంటి చర్యలను సంస్థ చేపట్టింది. ఓయోను కేవలం యువ జంటలు గదులు బుక్ చేసుకునే సంస్థగా కొందరు భావించినప్పటికీ, సంస్థ వ్యాపారం దానికంటే చాలా విస్తృతంగా ఉంది. కుటుంబాలు, పర్యాటకులు, ఉద్యోగరీత్యా ప్రయాణించే వారు, దీర్ఘకాలికంగా వసతి కోరుకునే వారు ఇలా అనేక వర్గాల వినియోగదారులకు వసతి సదుపాయాలు అందించే దిశగా సంస్థ తన పరిధిని పెంచుకుంది. కొన్ని హోటళ్లలో జంటలకు సంబంధించిన బుకింగ్ నిబంధనలు ఆయా హోటళ్ల విధానాలపై ఆధారపడి ఉంటాయి.ఓయో మాతృసంస్థ ప్రస్తుతం భారతదేశాన్ని దాటి అనేక దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అమెరికాలోని మోటెల్ 6, స్టూడియో 6 వంటి బ్రాండ్లను నిర్వహించే జీ6 హాస్పిటాలిటీని కొనుగోలు చేయడం ద్వారా అమెరికా మార్కెట్‌లో సంస్థ తన స్థాయిని మరింత పెంచుకుంది.ఓయో స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు గతంలో కూడా ప్రయత్నించింది. అయితే ఆ ప్రక్రియలో అనేక మలుపులు చోటుచేసుకున్నాయి. 2026లో ఓయో మాతృసంస్థ ప్రిజమ్ మరోసారి ప్రజా వాటాల జారీ ప్రక్రియలో ముందుకు వచ్చింది. ప్రతిపాదిత ప్రకారం వేల కోట్ల రూపాయల నిధులను సమీకరించే ప్రణాళికను సంస్థ ముందుకు తీసుకెళ్లింది.ఓయో సంస్థ విలువను సామాజిక మాధ్యమాల్లో తరచుగా వేల కోట్ల రూపాయలుగా పేర్కొంటూ వివిధ గణాంకాలు ప్రచారం అవుతున్నాయి. అయితే సంస్థ విలువను అంచనా వేయడానికి కేవలం ఒక సంఖ్యను మాత్రమే ఆధారంగా చేసుకోవడం కంటే సంస్థ ఆదాయం, లాభాలు, ఆస్తులు, కార్యకలాపాల విస్తృతి, పెట్టుబడులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం.రితేష్ అగర్వాల్ విజయాన్ని కేవలం ఆయన డిగ్రీ పూర్తి చేయలేదనే అంశంతో చూడటం సరైనది కాదు. మార్కెట్‌లోని సమస్యను గుర్తించడం, వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకోవడం, కొత్త ఆలోచనను వ్యాపారంగా మార్చడం, పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార విధానాన్ని మార్చుకోవడం, ఎదురైన సవాళ్ల నుంచి బయటపడేందుకు కొత్త మార్గాలను అన్వేషించడం వంటి అనేక



అంశాలు ఆయన ప్రయాణంలో కనిపిస్తాయి.ఒకప్పుడు తక్కువ ధర హోటళ్లలో ఉన్న సమస్యలను గమనించిన ఒక యువకుడి ఆలోచన.. క్రమంగా ఒక పెద్ద వసతి సేవల సంస్థగా మారింది. చిన్న ఆలోచనను సరైన విధంగా అమలు చేస్తే అది పెద్ద అవకాశంగా మారగలదని ఓయో ప్రయాణం చెబుతోంది.డిగ్రీ ఉండటం మాత్రమే విజయానికి హామీ కాదు.. డిగ్రీ లేకపోవడం కూడా విజయానికి అడ్డంకి కాదు. సమస్యను గుర్తించే ఆలోచన, పరిష్కారాన్ని రూపొందించే సామర్థ్యం, నిరంతరం నేర్చుకునే తత్వం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగే పట్టుదల-వ్యాపార ప్రయాణంలో ఇవన్నీ కీలకమే.ఓరావెల్ స్టేస్ నుంచి ఓయో వరకు.. చిన్న ఆలోచన నుంచి ప్రపంచవ్యాప్త వసతి సేవల సంస్థగా ఎదిగిన రితేష్ అగర్వాల్ ప్రయాణం ఇదే.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV
శనివారం 26- 09- 2026
www.jaibheemtv.com


# నిద్రకు ఎంతో ప్రాధాన్యం ఉంది..!

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
ఆరోగ్యంగా, ఎక్కువకాలం జీవించేందుకు నిద్రకు ఎంతో ప్రాధాన్యం ఉంది. వ్యాపారవేత్త బ్రయాన్ జాన్సన్ తన ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా నిద్రకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా తనకు పర్ఫెక్ట్ స్లీప్ స్కోర్ సాధ్యమైందని ఆయన వెల్లడించారు. అయితే ప్రముఖులు పాటించే నిద్ర విధానాలను అందరూ తప్పనిసరిగా అనుసరించాల్సిన అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత అవసరాలు మారుతాయి కాబట్టి, తగినంత సమయం నిద్రపోవడం, క్రమబద్ధమైన నిద్ర సమయాన్ని పాటించడం, నిద్ర నాణ్యతపై దృష్టి పెట్టడం ముఖ్యమని చెబుతున్నారు. మంచి నిద్ర మెదడు పనితీరు, శారీరక ఆరోగ్యం, మొత్తం శ్రేయస్సుకు తోడ్పడుతుంది.

నిద్ర సమయాన్ని ప్రతిరోజూ సాధ్యమైనంత వరకు ఒకే విధంగా ఉంచడం వల్ల శరీరంలోని జీవ గడియారం క్రమబద్ధంగా పని చేయడానికి సహాయపడుతుంది. అలాగే పడుకునే ముందు ఫోన్, ల్యాప్‌టాప్ వంటి ప్రకాశవంతమైన తెరలను ఎక్కువగా చూడకుండా ఉండడం మంచిది. పడుకునే గదిని చీకటిగా, నిశ్శబ్దంగా, సౌకర్యవంతంగా చల్లగా ఉంచడం కూడా నిద్రకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తుంది. రాత్రి వేళల్లో అధికంగా తినడం, ఆలస్యంగా కెఫీన్ వంటి ఉద్దీపన పదార్థాలను తీసుకోవడం నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. అందువల్ల పడుకునే ముందు కొంత సమయం ప్రశాంతంగా గడపడం, శరీరం, మనసును విశ్రాంతికి సిద్ధం చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, మంచి నిద్ర కోసం ఖరీదైన పరికరాలు, ప్రత్యేకమైన పర్యవేక్షణ వ్యవస్థలు లేదా చాలా కఠినమైన నియమాలు అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. పెద్దలు సాధారణంగా రోజుకు 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరమైన నిద్ర సమయం వ్యక్తిని బట్టి మారుతుంది. నిద్ర విషయంలో సంక్లిష్టమైన విధానాల కంటే క్రమబద్ధత, తగినంత నిద్ర, నాణ్యమైన విశ్రాంతి ముఖ్యమైనవి. క్రమం తప్పకుండా పెద్దగా గురక పెట్టడం, రాత్రి పూట పదేపదే మేల్కొనడం, ఉదయం తలనొప్పి, పగటిపూట అధిక నిద్రమత్తు లేదా నిద్రలో శ్వాస ఆగినట్లు కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి నిద్రలో శ్వాసకు సంబంధించిన సమస్యలకుసంకేతాలయ్యే అవకాశం ఉంది.

**సరిగ్గా నిద్రలేకపోతే గుండె ఆరోగ్యంపై ప్రభావం..**
నిద్ర సరిగా లేకపోవడం గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపిస్తుంది. నిద్ర సమయంలో రక్తపోటు, గుండె వేగం, ఒత్తిడి హార్మోన్లు, జీవక్రియ వంటి అనేక శారీరక ప్రక్రియలు నియంత్రించబడతాయి. దీర్ఘకాలంగా నిద్ర సరిగా లేకపోవడం లేదా నిద్ర సమయాల్లో ఎక్కువ మార్పులు ఉండడం వల్ల శరీరంపై అదనపు ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంది. అయితే గుండె ఆరోగ్యానికి నిద్ర ఒక్కటే పరిష్కారం కాదు. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, ఒత్తిడిని నియంత్రించడం, పొగాకుకు దూరంగా ఉండడం, మద్యపానాన్ని పరిమితం చేయడం కూడా ముఖ్యమే. కాబట్టి బ్రయాన్ జాన్సన్ విధానంలోని కొన్ని అలవాట్లను స్ఫూర్తిగా తీసుకోవచ్చు కానీ, ప్రధానంగా తగినంత నిద్ర, క్రమబద్ధమైన సమయం, మంచి నిద్ర నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.






# క్యాన్సర్ చికిత్సలో కొత్త పరీక్షా పరికరం..!

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
అండాశయ క్యాన్సర్ చికిత్సలో వ్యాధి శరీరంలో ఎంతవరకు వ్యాపించిందో ముందుగానే కచ్చితంగా తెలుసు కోవడం చాలా కీలకం. ముఖ్యంగా పొత్తికడుపులోని అవయవాలను కప్పి ఉండే పలుచని పొర అయిన పెరిటోనియంలోకి క్యాన్సర్ వ్యాపించినప్పుడు చిన్నచిన్న కణితి ముద్దలను సాధారణ స్కాన్ల ద్వారా గుర్తించడం కొన్నిసార్లు కష్టంగా ఉంటుంది. కొత్త తరహా స్కాన్ అండాశయ క్యాన్సర్ వ్యాప్తిని మరింత స్పష్టంగా గుర్తించేందుకు ఉపయోగపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెంగళూరులో 200 మంది అండాశయ క్యాన్సర్ బాధితులపై నిర్వహించిన అధ్యయనంలో సాధారణ కాంట్రాస్ట్ సీటీ స్కాన్‌తో పోలిస్తే మెరుగైన ఫలితాలను చూపించింది.

**వ్యాధి తీవ్రతను 39 పాయింట్లతో అంచనా..**
అండాశయ క్యాన్సర్ నిర్ధారణ సమయంలో 70 శాతానికి పైగా కేసుల్లో పెరిటోనియంలోకి క్యాన్సర్ వ్యాప్తి ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. దీనివల్ల పొత్తికడుపు ఉబ్బరం, నొప్పి, మల విసర్జనలో మార్పులు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే లక్షణాలను బట్టి మాత్రమే వ్యాధి ఎంతవరకు వ్యాపించిందో అంచనా వేయడం సాధ్యం కాదు. అందుకే వైద్యులు పెరిటోనియల్ క్యాన్సర్ ఇండెక్స్ ద్వారా పొత్తికడుపులోని 13 ప్రాంతాలను పరిశీలించి, వ్యాధి తీవ్రతను గరిష్ఠంగా 39 పాయింట్ల వరకు అంచనా వేస్తారు. ముఖ్యంగా పేగులు, మెసెంటరీ, పొత్తికడుపు పైభాగంలోని కొన్ని ప్రాంతాల్లో క్యాన్సర్ ఉంటే పూర్తిగా తొలగించడం కష్టమవుతుంది. స్కాన్‌లో వ్యాధి తీవ్రత తక్కువగా కనిపిస్తే, శస్త్రచికిత్స సమయంలో పూర్తిగా తొలగించడం సాధ్యం కాదని తేలే పరిస్థితి ఏర్పడుతుంది. బెంగళూరులో మే 2024 నుంచి ఏప్రిల్ 2025 మధ్య నిర్వహించిన అధ్యయనంలో ప్రతి ఒక్కరికీ,సాధారణ కాంట్రాస్ట్ సీటీ రెండింటినీ చేశారు. శస్త్రచికిత్స సమయంలో కనిపించిన వ్యాధి స్థితితో స్కాన్ ఫలితాలను పోల్చారు. పెరిటోనియంలో క్యాన్సర్‌ను గుర్తించడంలో సున్నితత్వం 81.8 శాతంగా ఉండగా, సాధారణ సీటీకి ఇది 54.6 శాతంగా ఉంది. మొత్తం నిర్ధారణ కచ్చితత్వంలో 86 శాతం, సీటీలో 78 శాతంగా నమోదైంది. ముఖ్యంగా పొత్తికడుపు పైభాగంలో సున్నితత్వం 76.5 శాతంగా ఉండగా, సీటీలో కేవలం 23.5 శాతంగా ఉంది. చిన్న పేగు, మెసెంటరీ ప్రాంతాల్లోనూ మెరుగ్గా క్యాన్సర్‌ను గుర్తించింది. సాధారణ సీటీతో పోలిస్తే క్యాన్సర్ వ్యాప్తిని మరింత దగ్గరగా అంచనా వేసినట్లు అధ్యయనం తెలిపింది. ప్రత్యేకత ఏమిటంటే, ఇది కేవలం కణితి పరిమాణం, ఆకారంపై ఆధారపడకుండా క్యాన్సర్ చుట్టూ ఉండే కణజాలంలోని ఫైబ్రోబ్లాస్ట్ యాక్టివేషన్ ప్రోటీన్ ను లక్ష్యంగా చేసుకుంటుంది. సాధారణ పేగుల్లో దీని శోషణ తక్కువగా ఉండడం, పరీక్షకు ముందు ఉపవాసం అవసరం లేకపోవడం వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఇది సాధారణ స్కాన్లు, శస్త్ర చికిత్స సమయంలో చేసే అంచనా లేదా వైద్య బృందం నిర్ణయానికి ప్రత్యామ్నాయం కాదు. ఈ పరిశోధన ఒకే కేంద్రం లో నిర్వహించబడడం, ఎక్కువ మంది రోగులకు స్కాన్‌కు ముందు కీమోథెరపీ ఇవ్వడం వంటి పరిమితులు ఉన్నాయి. వల్ల అవసరం లేని శస్త్రచికిత్సలు నిజంగా ఎంతవరకు తగ్గుతాయో తెలుసుకోవడానికి మరిన్ని పెద్దస్థాయి పరిశోధనలు అవసరమని అధ్యయనం పేర్కొంది.

## కూల్ డ్రింక్స్ తాగితే యమ డేంజర్..

# ఎందుకో తెలుసా..?



**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
వేసవిలో చాలామంది చల్లని పానీయాలు తాగడానికి ఇష్టపడతారు. ఇవి చాలా రుచిగా ఉండటంతోపాటు వెంటనే చల్లదనం కూడా ఇస్తాయి. అయితే కొందరు ఈ పానీయాలతోపాటు చిప్స్ కూడా తింటారు. కొందరిలో సాధారణంగా కనిపించే ఈ అలవాటు ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అలవాటు ఉంటే తక్షణమే మానుకోవాలని సూచిస్తున్నారు. కూల్‌డ్రింక్స్‌తో చిప్స్ తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..చల్లని పానీయాలలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. కొన్నింటిలో కెఫీన్ కూడా ఉంటుంది. ఇవి తాగినప్పుడు తాత్కాలికంగా దాహం తగ్గినట్లు అనిపించినా, వాస్తవానికి శరీరంలో నీరు తగ్గే అవకాశం ఉంది. అంటే డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల నీరసం, తల తిరగడం, అలసట వంటి సమస్యలు రావచ్చు. వేసవిలో శరీరానికి తగినంత నీరు అవసరం కాబట్టి నీటిని శాతాన్ని తగ్గించ కూల్‌డ్రింక్స్ తాగడం మరింత ప్రమాదకరం.ఇక చిప్స్ విషయానికి వస్తే.. చిప్స్‌లో ఉప్పు, హానికరమైన కొవ్వులు (ట్రాన్స్ ఫ్యాట్స్) ఎక్కువగా ఉంటాయి.

ఇవి శరీరంలో నీటిని తగ్గించడమే కాకుండా, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కూడా దెబ్బ తీస్తాయి. దాంతో దాహం మరింత పెరుగుతుంది. ఫలితం గా మళ్లీ మళ్లీ చల్లని పానీయాలు తాగే అలవాటు పెరుగుతుంది. దీర్ఘకాలంలో బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. అందుకే కూల్‌డ్రింక్స్ తరచూ తాగే అలవాటు ఉన్నవాళ్లు వాటికి బదులుగా నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి సహజ పానీయాలు తాగడం మంచిది. ఇవి శరీరానికి తేమను అందించి, ఆరోగ్యాన్ని కాపాడుతాయి. అదేవిధంగా కూల్‌డ్రింక్స్‌తోపాటు చిప్స్‌కు బదులుగా వేయించిన మఖానా, వేరుశెనగలు లేదా తాజా పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## చర్మం వైపు రక్తప్రసరణ ఎక్కువగా మళ్లుతుంది

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం :**
వేడి వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలకు ఎక్కువసేపు గురికావడం వల్ల శరీర ఉష్ణోగ్రత ప్రమాదకర స్థాయికి పెరిగి వడదెబ్బకు దారితీస్తుంది. అయితే వడదెబ్బ తీవ్రమయ్యే ముందే శరీరంలోని జీర్ణవ్యవస్థపై వేడి ప్రభావం చూపే అవకాశం ఉంది. అధిక వేడి కారణంగా శరీరాన్ని చల్లబరచేందుకు చర్మం వైపు రక్తప్రసరణ ఎక్కువగా మళ్లుతుంది. దీంతో పొట్ట, పేగులకు చేరే రక్తప్రసరణ తగ్గి జీర్ణక్రియపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని కొన్నిసార్లు థర్మల్ లీక్ గా పేర్కొంటారు. ఇది అధికారిక వైద్య నిర్ధారణ కాదు. తీవ్రమైన వేడి వల్ల పేగుల రక్షణ పొర దెబ్బతిని వాటి పనితీరులో మార్పులు వచ్చే పరిస్థితిని వివరించేందుకు ఈ పదాన్ని ఉపయోగిస్తారు. అధిక వేడి కారణంగా జీర్ణక్రియ మందగించడంతోపాటు పొట్ట, పేగుల అంతర్గత పొరపై కూడా ప్రభావం పడుతుంది. పేగుల రక్షణ వ్యవస్థ బలహీనపడడం వల్ల జీర్ణవ్యవస్థలో అసౌకర్యం, వాపు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. వడదెబ్బకు ముందే ఆకలి తగ్గడం, వికారం, కడుపులో మంట లేదా నొప్పి, పొట్ట ఉబ్బరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన వేడి సమయంలో ఇలాంటి జీర్ణ సంబంధిత మార్పులను నిర్లక్ష్యం చేయకుండా శరీరంలో వేడి ఒత్తిడికి సంబంధించిన సంకేతాలుగా గుర్తించడం అవసరం.వేడి వాతావరణంలో చెమట ద్వారా శరీరం నుంచి పెద్ద మొత్తంలో నీరు, లవణాలు బయటకు వెళ్లడం వల్ల నిర్జలీకరణం ఏర్పడుతుంది. దీంతో జీర్ణవ్యవస్థ పనితీరు మరింత ప్రభావితమవుతుంది. శరీరంలోని ఎలక్ట్రోలైట్ల సమతుల్యత దెబ్బతినడం కూడా పేగుల పనితీరుపై ఒత్తిడిని పెంచుతుంది. తీవ్రమైన వేడి వల్ల పేగుల రక్షణ పొర మరింత దెబ్బ తినే అవకాశం ఉండడంతో వాపు వంటి ప్రతిచర్యలు కూడా ఏర్పడతాయి.

# గుండె ఆరోగ్యానికి ఏది ఎక్కువ హాని చేస్తుంది..?

గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపే ఆహార పదార్థాల్లో ఉప్పు, చక్కెర రెండూ ముఖ్యమైనవే. పరిమిత మోతాదులో వీటిని ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిది. అయితే మితిమీరిన ఉప్పు, అదనపు చక్కెర తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ముప్పు పెరుగుతుంది. ముఖ్యంగా అధిక రక్తపోటు ఉన్నవారికి ఉప్పు ఎక్కువగా తీసుకోవడం మరింత సమస్యగా మారుతుంది. అధిక ఉప్పు శరీరంలో నీటిని నిల్వ చేసేలా చేసి రక్తపోటును పెంచుతుంది. దీనివల్ల గుండె, రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి గుండె జబ్బులు, గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు కూడా ఉప్పు విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. రోజువారీ ఆహారంలో సోడియం ఎక్కువగా చేరడానికి వంటలో లేదా భోజన సమయంలో వేసే ఉప్పే కారణం కాదు. ప్యాకెట్ ఆహారాలు, తక్షణం తయారుచేసుకునే ఆహారాలు, సాస్‌లు, ఊరగాయలు, ఉప్పగా ఉండే చిరుతిళ్లు వంటి వాటిలోనూ సోడియం అధికంగా ఉంటుంది. అందువల్ల టేబుల్‌పై ఉప్పు డబ్బాను పక్కన పెట్టడం మాత్రమే సరిపోదు. ఆహార పదార్థాలపై ఉండే లేబుళ్లను పరిశీలించి సోడియం తక్కువగా ఉన్న వాటిని ఎంచుకోవడం, తాజా లేదా తక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఉపయోగకరం. మరోవైపు అధికంగా అదనపు చక్కెర తీసుకోవడం బరువు పెరగడం, ఊబకాయం, టైప్-2 మధుమేహం, రక్తంలో ట్రైగ్లిజరైడ్లు పెరగడం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇవన్నీ కాలక్రమంలో గుండె జబ్బుల ముప్పును పెంచుతాయి.అయితే ఉప్పు, చక్కెరలో ఏది ఎక్కువ ప్రమాదకరమనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉండదు. అధిక రక్తపోటు ఉన్నవారు అదనపు సోడియం తగ్గించడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఊబకాయం, మధుమేహం లేదా ట్రైగ్లిజరైడ్లు ఎక్కువగా ఉన్నవారు అదనపు చక్కెర, మొత్తం కేలరీలపై శ్రద్ధ పెట్టాలి. అంటే ఒకటి పూర్తిగా ప్రమాదకరం, మరొకటి సురక్షితం అని భావించకూడదు. రెండింటినీ మితంగా తీసుకోవడం అవసరం. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి ఆహారంలో ఏది ఎంత తగ్గించాలనే విషయం మారుతుంది. ముఖ్యంగా అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, మూత్రపిండాల వ్యాధి లేదా ఇతర గుండె సంబంధిత ముప్పులు ఉన్నవారు వైద్యులు లేదా పోషకాహార నిపుణుల



సలహా తీసుకోవడం మంచిది.గుండె ఆరోగ్యం కోసం ఉప్పు లేదా చక్కెర ఒక్కదానిపైనే దృష్టి పెట్టకుండా మొత్తం ఆహార విధానాన్ని మార్చుకోవడం ముఖ్యం. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు వంటి తాజా, తక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. ప్యాకెట్ ఆహారాలు, అధికంగా ప్రాసెస్ చేసిన చిరుతిళ్లు, చక్కెర కలిగిన పానీయాలు, అదనపు చక్కెర లేదా సోడియం ఎక్కువగా ఉన్న పదార్థాలను పరిమితం చేయాలి. శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన బరువు, ధూమపానానికి దూరంగా ఉండడం, రక్తపోటు, కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెరను నియంత్రించుకోవడం కూడా గుండె ఆరోగ్యానికి కీలకం. కాబట్టి ఒక్క పదార్థాన్ని పూర్తిగా మానేయడం కంటే, ఉప్పు, అదనపు చక్కెర రెండింటినీ మితంగా తీసుకుంటూ మొత్తం ఆహార నాణ్యతను మెరుగుపరచడం మరింత ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.